RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -288 పేజీలు - 08 వెల - 04/- శనివారం 30 ఆగస్టు 2025



# జిఎస్టీ సవరణల నష్టాన్ని కేంద్రమే భరించాలి

## రాష్ట్రాల ఆదాయం దెబ్బతినకుండా చూడాలి

### జిఎస్టీ కౌన్సిల్ భేటీలో పలు రాష్ట్రాల ఆర్థికమంత్రుల డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్ట్29ఆంధ్ర ప్రగతి :** కేంద్రం వస్తు సేవల పన్ను జిఎస్‌టి రేటు నిర్మాణాన్ని సవరించడంతో ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు పరిహారం చెల్లించాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు శుక్రవారం డిమాండ్ చేశాయి. జిఎస్‌టి రేటు నిర్మాణ సవరణ ప్రతిపాదనతో రాష్ట్రాలకు సుమారు రూ. 1.5కోట్ల నుండి రూ. 2 లక్షల కోట్ల వరకు ఆదాయ నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నాయి. ఎనిమిది రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, కేరళ,పంజాబ్, తమిళనాడు, తెలంగాణ మరియు పశ్చిమబెంగాల్ రాష్ట్రాల ఆర్థికమంత్రులుమిగతాది 2లో...

## వచ్చే ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల

# పెట్టుబడుల లక్ష్యం

### విశాఖలో ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్ లో చంద్రబాబు

**మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఏపీలో పెట్టుబడి అవకాశాలు!: చంద్రబాబునాయుడు**

**అమరావతిలో చాప్టర్ ఏర్పాటుపై ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటన**



**విశాఖ ఆగస్ట్29ఆంధ్ర ప్రగతి :**
ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్లలో ఈ రంగాల్లో రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడులను సాధిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి హాజరయ్యారు.మిగతాది 2లో...

## రుషికొండ ప్యాలెస్ వినియోగిస్తాం



**బెడ్ రూమ్‌లు, బాత్ రూమ్‌లు చూసి విస్తుపోయిన పవన్ కల్యాణ్**

**విశాఖ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**మంత్రులు, జనసేన ఎమ్మెల్యేలతో కలిసి రుషికొండ ప్యాలెస్ ను పరిశీలించిన వైనం**

**ఈ ప్యాలెస్ పై అసెంబ్లీలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్న పవన్**

## రాష్ట్ర ప్రగతిలో సీఏలు

# మార్గదర్శకులు కావాలి

**2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమన్న మంత్రి నారా లోకేశ్**

**రాష్ట్ర అభివృద్ధిలో చార్టర్డ్ అకౌంటెంట్లు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని వ్యాఖ్య**

**ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణకే కట్టుబడి ఉన్నామన్న లోకేశ్**

**విశాఖ ఆగస్ట్29ఆంధ్ర ప్రగతి :**
2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఈ బృహత్తర ప్రయాణంలో చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏలు) కేవలం భాగస్వాములుగా కాకుండా మార్గదర్శకులుగా నిలవాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. మిగతాది 2లో...




# నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ

**కాళేశ్వరం, బిసి రిజర్వేషన్లపై చర్చఏర్పాట్లను సమీక్షించిన స్పీకర్**



2లో.



## తాడిపత్రికి వెళ్లేందుకు తొలగిన అడ్డంకులు..

# పెద్దారెడ్డికి సుప్రీం గ్రీన్ సిగ్నల్

2లో.

**తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట**

**తాడిపత్రిలోకి ప్రవేశించకుండా గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే**

**కేతిరెడ్డికి భద్రత కల్పించాలని ఏపీ పోలీసులను ఆదేశించిన సర్వోన్నత న్యాయస్థానం**



# జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

2లో.

## : టోక్యోలో మోదీ

**టోక్యోలో ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రధాని మోదీ ప్రసంగం**

**ప్రపంచమంతా భారత్ వైపే చూస్తోందన్న ప్రధాని**

**త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ధీమా**

## జగన్ కోసమే మోదీ

# సీబీఐ గొంతు నొక్కారు

**వివేకా హత్య కేసుపై వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు**

**మోదీకి జగన్ దత్తపుత్రుడంటూ తీవ్ర విమర్శలు**

**అన్ని ఆధారాలున్నా దోషులకు శిక్ష పడటం లేదని ఆవేదన**

**విశాఖ ఆగస్ట్29ఆంధ్ర ప్రగతి :**
తన చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విషయంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి జగన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడని, అందుకే జగన్‌ను, ఆయన సోదరుడు అవినాశ్ రెడ్డిని కాపాడటం కోసం మోదీ సీబీఐ గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసు దర్యాప్తును ప్రస్తావిస్తూ, ఈ కేసులో మళ్లీ విచారణ ఎందుకు చేపట్టరని ప్రభుత్వాన్ని షర్మిల సూటిగా ప్రశ్నించారు. “వై నాట్?” అంటూ నిలదీశారు. ఇన్నేళ్లుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.మిగతాది 2లో...



# మెరుగైన బోధన దిశగా ప్రమాణాలు

### అన్ని విద్యా సంస్థల్లో ఫేషియల్ రికగ్నేషన్

### విద్యాశాఖపై ఐసీసీలో సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్, **ఆగస్ట్29ఆంధ్ర ప్రగతి ::** పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు మరింత పెంచాలని రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు- ప్రొఫెషనల్ విద్యాసంస్థల్లో లోటు-పాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యాశాఖపై ఐసీసీలో సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వేర్వేరు విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. మిగతాది 2లో...

# ఆగని వానలు

- అల్పపీడనంకు అనుబంధంగా ఆవర్తనం..
- ఏపీ, తెలంగాణకు మరో వారం రోజులపాటు భారీ వర్షాలే
- ఛత్తీస్‌గఢ్‌లో అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- ఏపీలోని 6 ప్రధాన పోర్టుల్లో మూడో ప్రమాద సిగ్నల్ జారీ

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వానల అంచనా



2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## జీఎస్టీ సవరణల నష్టాన్ని కేంద్రమే భరించాలి

(మొదటి పేజీ తరువాయి)

సెప్టెంబర్ 3 మరియు 4 తేదీల్లో జరిగే తదుపరి జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో తమ ప్రతిపాదనను సమర్పించాలని నిర్ణయించారు. రేటు- నిర్మాణ సవరణ, ఆదాయ నష్టాన్ని సమతుల్యం చేయడానికి అల్ట్రా లగ్జరీ, సిగరెట్ వంటి వస్తువులపై ప్రతిపాదిత 40శాతం రేటుతో పాటు అదనపు సుంకాన్ని విధించాలని సూచించాయి. ఈ లెవీ నుండి వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆదాయ భద్రతను లెక్కించడానికి బేస్ ఇయర్‌ను 2024-25గా నిర్ణయించాలని ఎనిమిది రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. ప్రతిపాదిత అదనపు లెవీ విధించిన తర్వాత కూడా లోటు ఉంటే, కేంద్ర ప్రభుత్వం అదనపు లెవీ భవిష్యత్ రసీదులకు బదులుగా సెక్యూరిటీ- కల్పించబడిన రుణాలను సేకరించాలని రాష్ట్రాలు తమ ప్ర తిపాదనలో పేర్కొన్నాయి.

## జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

### : టోక్యోలో మోదీ

భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలు కేవలం మన వృద్ధిని గమనించడమే కాకుండా మనపై గట్టి నమ్మకంతో ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జపాన్ పర్యటనలో ఉన్న మోదీ... టోక్యోలో జరిగిన ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, పారదర్శక విధానాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ మనదే" అని స్పష్టం చేశారు. దేశంలో పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా, అవి రెట్టింపు అవుతున్నాయని ఆయన వివరించారు. భారత్, జపాన్ మధ్య భాగస్వామ్యం కేవలం వ్యూహాత్మకమే కాదని, అదొక స్మార్ట్ బంధమని ప్రధాని అభివర్ణించారు. ఈ రెండు దేశాల కలయిక ఆసియా శతాబ్దంలో స్థిరత్వం, వృద్ధి, శ్రేయస్సును నిర్దేశిస్తుందని ఆయన అన్నారు.

సాంకేతిక రంగంలో భారత్, జపాన్ కలిసి పనిచేసే అవకాశాలపై మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్, అంతరిక్ష రంగాల్లో భారత్ ఎంతో ధైర్యమైన, ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేపట్టింది. జపాన్ సాంకేతికత, భారత ప్రతిభావంతుల మేధస్సు కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించవచ్చు" అని మోదీ తెలిపారు. ఈ రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలు ఉమ్మడి శ్రేయస్సుగా మారాయని, జపాన్ వ్యాపారాలకు భారత్ ఒక మంచి వేదిక అని ఆయన పేర్కొన్నారు.

## మెరుగైన బోధన దిశగా ప్రమాణాలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలు, పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనం కోసం ఒకే విభాగం కింద ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని.. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. కం-టైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. కంటైనర్లపై సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవసరమైతే కాంట్రాక్టు పద్ధతిలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని... ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు.

## వచ్చే ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడుల లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభదాయకంగా, సుస్థిరంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఆహార శుద్ధి రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఈ పరిశ్రమ విలువ ప్రస్తుతం 8 ట్రిలియన్ డాలర్లుగా ఉందని, భారత్ కూడా 2030 నాటికి 700 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ రంగంలో భారత్ మరింత వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతం ఆహార శుద్ధిలో ఆంధ్రప్రదేశ్ 9 శాతం వాటాతో 50 బిలియన్ డాలర్ల విలువను కలిగి ఉందని అన్నారు. అలాగే జీఎస్డీపీలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల వాటా 35 శాతంతో రూ.5.19 లక్షల కోట్లుగా ఉందన్నారు. త్వరలోనే ఏపీ ఫ్రూట్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా అవతరిస్తుందని, దేశంలోని ఉత్పత్తిలో 25 శాతం వాటాకు చేరుకుంటామని తెలిపారు. అదేవిధంగా 2.26 లక్షల హెక్టార్లలో ఆక్వా కల్చర్ సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆక్వా హబ్‌గా ఉందని స్పష్టం చేశారు.

**ఫుడ్ ప్రాసెసింగ్ లో అవకాశాలు- ప్రోత్సాహకాలు**

ఆంధ్రప్రదేశ్‌లో ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. విస్తృతమైన మౌలిక సదుపాయాలు కూడా ఆంధ్రప్రదేశ్ సొంతమని పెట్టుబడిదారులు, ఎగుమతిదారులకు వివరించారు. రాష్ట్రంలో 9 ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులు, 17 లక్షల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్, 33 లక్షల టన్నుల సరకు నిల్వ చేసేందుకు గోదాములు ఉన్నాయని అన్నారు. ఆహారం, పానీయాల యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. చిత్తూరు, గుంటూరు, కోస్తాంధ్ర, విశాఖ జిల్లాల్లో పండ్లు, సుగంధ ద్రవ్యాలు, ఆక్వా, కోకో, కాఫీ క్లస్టర్లు ఉన్నాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, రూ.200 కోట్లకు పైగా పెట్టుబడులు దాటితే వాటిని మెగా ప్రాజెక్టులుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం వెల్లడించారు. గత ఏడాది రాష్ట్రానికి ఆహార శుద్ధి రంగంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు.

**ఆహారపు అలవాట్లు- మారుతున్న జీవన శైలితో పెట్టుబడులకు అవకాశాలు**

ప్రజల ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలితో ఆహార శుద్ధి రంగంలో అపారమైన అవకాశాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయమని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ రంగంలో వచ్చే ఎంఎస్ఎంఈలను కూడా ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని అన్నారు. వన్ ఫ్యామిలి -వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు.

అలాగే ఆహారం, పానీయాల రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇస్తామని అన్నారు. అగ్రిటెక్ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ట్రేసబిలిటి, సర్టిఫికేషన్, ప్యాకేజింగ్ లాంటి సవాళ్లపై దృష్టి పెడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

మరోవైపు భారత్‌లో తయారయ్యే ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో గ్లోబల్ బ్రాండ్స్‌గా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందమైన విశాఖ ఇప్పుడు దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షితమైన నగరంగా ఖ్యాతి గడించిందన్నారు. త్వరలోనే సీ కేబుల్, డేటా సెంటర్లు కూడా విశాఖలో ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. ఏపీలో ఆహార శుద్ధి సహా వ్యవసాయాధారిత పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులను ప్రోత్సహించేందుకు అమరావతిలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చాప్టర్ ఏర్పాటు కానుండటం సంతోషదాయకమని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీలో ఫుడ్ మాన్యుఫాక్చరింగ్‌పై చర్చలు**

ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్ మూడో ఎడిషన్‌లో ఏపీలో విలువ జోడించిన ఆహార ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్ చేసిన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఆక్వా రంగంలో బ్రీడింగ్, నాణ్యమైన ఫీడ్, వ్యాధుల నియంత్రణ, ఎక్స్‌పోర్ట్ లింకేజిపై పారిశ్రామికవేత్తలు, నిపుణులు, పరిశోధకులు చర్చించారు.

పంట ఉత్పత్తి అనంతర నష్టాల నివారణ, స్మార్ట్ కోల్డ్ చెయిన్, లాజిస్టిక్స్ సదుపాయాలపై దృష్టి పెట్టే అంశంపైనా చర్చలు జరిగాయి. డైరీ, పౌల్ట్రీ, మాంసం ప్రాసెసింగ్ యూనిట్ల ఆటోమేషన్, ఎగుమతి ప్రమాణాలపై సదస్సులో చర్చించారు. ఈ సమావేశానికి ఏపీ మంత్రులు టీజీ భరత్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టీపీసీఐ చైర్మన్ మోహిత్ సింగ్లా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామిక ప్రతినిధులు, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఎగుమతిదారులు, నిపుణులు హాజరయ్యారు.

## రాష్ట్ర ప్రగతిలో సీఏలు మార్గదర్శకులు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహించిన 'అర్థసమృద్ధి%-%2025' సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని లోకేశ్ తెలిపారు. సీఏలు కేవలం ఖాతా పుస్తకాలు సరిచూసే ఆడిటర్లు మాత్రమే కాదని, బాధ్యతకు, జవాబుదారీతనానికి ప్రతిరూపాలని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి బ్రాండ్ అంబాసడర్లుగా మారి, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో నైతిక సలహాలు అందించాలని కోరారు. విశాఖపట్నంలో అకౌంటింగ్, ఆడిటింగ్ రంగంలో ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుకు ఐసీఏఐ చొరవ చూపాలని సూచించారు.

**ఒకే రాజధాని.. ప్రాంతీయ అభివృద్ధి**

'ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ' అనే నినాదంతో తాము ముందుకెళ్తున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. అనంతపురంలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, ఉత్తరాంధ్రలో ఐటీ, ఫార్మా రంగాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. మరో ఏడాదిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తయితే విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ధీమా వ్యక్తం చేశారు.

**పాలనలో సాంకేతికతకు పెద్దపీట**

పరిపాలనలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఏఐ ఆధారిత పాలన ద్వారా ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఇప్పటికే 'మనమిత్ర' ద్వారా 700 రకాల పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ విధానాల వల్లే గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు విశాఖకు వస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఐసీఏఐ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఇతర ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## రుషికొండ ప్యాలెస్ వినియోగిస్తాం

**బెడ్ రూమ్‌లు, బాత్ రూమ్‌లు చూసి విస్తుపోయిన పవన్ కల్యాణ్**

**విశాఖ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**మంత్రులు, జనసేన ఎమ్మెల్యేలతో కలిసి రుషికొండ ప్యాలెస్ ను పరిశీలించిన వైనం**

**ఈ ప్యాలెస్ పై అసెంబ్లీలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్న పవన్**



**విశాఖ ఆగస్ట్29ఆంధ్ర ప్రగతి :**

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గత ప్రభుత్వ హయాంలో రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ ను పరిశీలించి తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విశాఖపట్నం పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్...

మంత్రులు, జనసేన ఎమ్మెల్యేలతో కలిసి రుషికొండకు చేరుకున్నారు. భవనాల లోపల ఉన్న అత్యంత విలాసవంతమైన బెడ్ రూమ్‌లు, బాత్ రూమ్‌లను చూసి విస్తుపోయారు. ప్రజాధనంతో ఇలాంటి ప్యాలెస్‌లు అవసరమా? అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ రుషికొండ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని పవన్ కల్యాణ్‌కు వివరించారు. గతంలో ఇక్కడ హరిత రిసార్ట్స్ ఉన్నప్పుడు ప్రభుత్వానికి ఏటా సుమారు ఏడు కోట్ల రూపాయల ఆదాయం వచ్చేదని తెలిపారు. కానీ, ఇప్పుడు ఈ కొత్త భవనాల నిర్వహణకే దాదాపు కోటి రూపాయల బిల్లులు బకాయి పడిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భవనాల నిర్మాణంపై ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నడుస్తోందని అధికారులు పవన్‌కు తెలిపారు.

పరిస్థితిని సమీక్షించిన అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ప్రకృతితో పెట్టుకుంటే ఉన్నది కూడా పోతుంది" అని వ్యాఖ్యానించారు. రుషికొండ భవనాల నిర్మాణం, ఖర్చు, పర్యావరణ విధ్వంసం వంటి అన్ని అంశాలపై శాసనసభ వేదికగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ నిర్మాణాలను పరిశీలించడానికి ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా, వాస్తవ పరిస్థితులను ప్రజల ముందు ఉంచేందుకు వచ్చానని తెలిపారు. పాడైపోతున్న భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## ఆగని వానలు

తెలుగు రాష్ట్రాలను వర్షాలు ఇప్పట్లో వీడేలా కనిపించడం లేదు. ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మరో వారం రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఈ అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం, రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతుండటంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఆరు జిల్లాల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందుజాగ్రత్త చర్యగా రాష్ట్రంలోని ఆరు ప్రధాన ఓడరేవుల్లో మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు గట్టిగా హెచ్చరించారు. మరోవైపు, తెలంగాణలోనూ వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల, భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది.

## జగన్ కోసమే మోదీ సీబీఐ గొంతు నొక్కారు

వివేకా కుమార్తె సునీత చేస్తున్న పోరాటంలో పూర్తి న్యాయం ఉందని, ఆమెకు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ పనితీరుపై షర్మిల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "సీబీఐ అనేది మోదీ చేతిలో ఒక కీలుబొమ్మగా మారిపోయింది. నిజంగా సీబీఐ చిత్తశుద్ధితో పనిచేసి ఉంటే ఈపాటికే దోషులకు శిక్ష పడేది" అని అన్నారు. హత్య జరిగినప్పుడు సంఘటనా స్థలంలో అవినాశ్ రెడ్డి ఉన్నారని చెప్పడానికి గూగుల్ మ్యాప్ లొకేషన్లతో సహా బలమైన ఆధారాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇన్ని సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ, అవినాశ్ రెడ్డిని కాపాడటానికే దర్యాప్తును నీరుగారుస్తున్నారని ఆమె ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు సరిగ్గా జరగడం లేదని సునీత చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉందని షర్మిల పేర్కొన్నారు.

## తాడిపత్రికి వెళ్లేందుకు తొలగిన అడ్డంకులు.. పెద్దారెడ్డికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

వైసీపీ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. తాడిపత్రిలోకి ప్రవేశించేందుకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంలో గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది.

వివరాల్లోకి వెళితే, తనను తాడిపత్రిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ కేతిరెడ్డి పెద్దారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఆయన వాదనలతో ఏకీభవించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, పి. సుధాకర్ రెడ్డి, అల్లంకి రమేశ్ వాదనలు వినిపించారు. రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ పెద్దారెడ్డిని సొంత నియోజకవర్గానికి దూరం చేస్తోందని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "మిమ్మల్ని మీ నియోజకవర్గంలోకి వెళ్లకుండా ఎవరు ఆపగలరు?" అని ప్రశ్నించింది. భద్రత విషయంలో ఆందోళన ఉంటే, అవసరమైతే ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. అంతేకాకుండా, కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే సమయంలో ఆయనకు తగిన భద్రత కల్పించాలని రాష్ట్ర పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలీసు భద్రతకు అయ్యే ఖర్చులను తామే భరిస్తామని పెద్దారెడ్డి తరపు న్యాయవాదులు కోర్టుకు తెలపడంతో ధర్మాసనం అంగీకరించింది. తాజా ఉత్తర్వులతో కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలో పర్యటించేందుకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయినట్లయింది.

## నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ

**కాళేశ్వరం, బిసి రిజర్వేషన్లపై చర్చ**

**ఏర్పాట్లను సమీక్షించిన స్పీకర్**



హైదరాబాద్, **ఆగస్ట్29ఆంధ్ర ప్రగతి :**): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శనివారం నుంచి అంటే.. ఆగస్టు 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై చర్చించ నున్నారు. తొలిరోజు దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం ప్రకటిస్తారు. నేటి నుండి ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసుశాఖ ఉన్నతాధికారుల తో శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముందస్తు సమావేశం నిర్వహించారు. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ- చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ ముదిరాజ్ ,లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెక్రటరీ రఘునందన్ రావు, అడిషనల్ సెక్రటరీ (ఫైనాన్స్)- రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్)- శివలింగయ్య హాజరయ్యారు. హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ- రవి గుప్తా, మహేష్ భగవత్, విక్రమ్ సింగ్ మాన్, సైబరాబాద్,రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజి- కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్- కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డిలు హాజరయ్యారు.

# శ్రీశైలం మనదే - నంద్యాల జిల్లా లోనే శ్రీశైలం ఉంటుంది.

## రాష్ట్ర న్యాయశాఖ, మైనారటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:**
రాయలసీమ అందులోని శ్రీశైలం మనదే, నంద్యాల జిల్లాలోనే శ్రీశైలం ఉంటుంది అపోహలు నమ్మవద్దు అంటూ రాష్ట్ర న్యాయశాఖ, మైనారటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్. ఎం డి ఫరూక్ స్పష్టం చేశారు.
శుక్రవారం నంద్యాల మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త యం. వి. రమణారెడ్డితో పాటు నంద్యాల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తూము విశ్వనాథ్ రెడ్డి, విహెచ్ పి జిల్లా ప్రచారం కార్యదర్శి లెజెండ్ శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాది బాలస్వామి, వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు గోవిందనాయుడు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకిరి రామచంద్రుడు, సామాజిక కార్యకర్తలు నవీన్ కుమార్, సురేష్ , చైతన్య తదితరులు నవ నందుల నిలయమైన నంద్యాల జిల్లాలోనే శ్రీశైలం ఉండేలా చూడండని, రాష్ట్ర న్యాయశాఖ, మైనారటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ కు వినతి పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ స్పందిస్తూ గత వైసీపీ పాలనలో కొత్త జిల్లాల ఏర్పాటు సక్రమంగా జరగలేదని, వాటిని సరిచేసి పరిపాలన సౌలభ్యం కోసం మరో ఆరు కొత్త జిల్లాల ఏర్పాటుకు అవసరమైన నివేదికలు సమర్పించాలని, కొత్త జిల్లాల ఏర్పాటుకు ప్రజాభిప్రాయం తీసుకోవాలని త్రి సభ్య మంత్రి వర్గ ఉప సంఘంను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసి అవసరమైన నివేదిక ప్రభుత్వం కు అందించాలని ఆదేశించారని అన్నారు. మంత్రి ఫరూక్ ఇచ్చిన వినతి పత్రం ఇలా...రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయబోయే మార్కాపురం జిల్లాలో శ్రీశైలం కలపవద్దని, నంద్యాల జిల్లాలోనే శ్రీశైలం కొనసాగేలా ప్రభుత్వం దృష్టికి మీరూ తీసుకెళ్లాలని కోరుతూ.. భూ మండలానికి నాభిలా ఉంటూ, అష్టాదశ శక్తి పీఠంలలో ఒకటైన శ్రీ భ్రమరాంబ అమ్మవారు. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలలో ఒకటైన శ్రీ మల్లికార్జున స్వామి వార్లు ఒకే చోట కొలువై నిత్య పూజలు అందుకుంటూ, భూకైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల పుణ్య క్షేత్రంను ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు దూరం చేసే స్వార్థపరుల కుట్రలను, రాష్ట్ర ప్రభుత్వం నమ్మవద్దని,
శ్రీశైల పుణ్యక్షేత్రం ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల ఆస్తి, సెంటిమెంట్ కూడా, ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ప్రకాశం జిల్లా మార్కాపురంను కొత్తగా జిల్లా ఏర్పాటు చేసి ఆ మార్కాపురం జిల్లాలో నంద్యాల జిల్లా పరిధిలోని శ్రీశైల పుణ్య క్షేత్రంను కలపాలని ఇప్పటికే మార్కాపురం ప్రాంతంలో డిమాండ్ తో కూడిన ఉద్యమం జరుగుతోంది. కర్నూలు, నంద్యాల జిల్లా ప్రజలు కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా వారసత్వ సంపద, ప్రజల ఆస్తి, సెంటిమెంట్ తో కూడుకున్న శ్రీశైల పుణ్య క్షేత్రంను కాపాడుకోవాల్సిన బాధ్యతతో సేవ్ శ్రీశైలం ప్రచారంలో మీకు విన్నపం చేస్తున్నాం.
ఉమ్మడి మద్రాసు రాష్ట్ర నుంచి తెలుగు ప్రజలు విడిపోయే ముందు తమిళులు తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని తమిళనాడు రాష్ట్రం లోనే ఉండాలనీ, అవసరమైతే వేలూరు జిల్లాను తీసుకోండని చెప్పినా వేలూరు జిల్లా ద్వారా అభివృద్ధి పోయినా తిరుమల తిరుపతి దేవాలయం తెలుగు ప్రజల ఆస్తి, హక్కు, సెంటిమెంట్ అని కాపాడుకోవడంతో ప్రపంచ హిందువుల ఆరాధ్య దైవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి పూజలు అందుకుంటూ భక్తుల కోర్కెలు తీరుస్తున్నారు.
రాయలసీమ నుంచి బళ్లారి జిల్లా కర్ణాటక రాష్ట్రం లోకి వెళ్ళిపోతే తుంగభద్ర డ్యామ్ నీరు సకాలంలో రాక కరువుతో అల్లాడుతాం అని తెలిసినా బాధను, కష్టాన్ని, నష్టాన్ని దిగమింగుతూ కూడా కర్ణాటక రాష్ట్రంలోకి శ్రీ రాఘవేంద్ర స్వామి దేవాలయాన్ని వెళ్లకుండా ఆనాటి కర్నూలు జిల్లా ప్రజలు మంత్రాలయంను కాపాడుకున్న చరిత్ర ఉంది.
తిరుపతి, మంత్రాలయంలను కాపాడుకున్న స్ఫూర్తితోనే మళ్ళీ శ్రీశైలంను మననుంచి దూరం కాకుండా ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలు ఐక్యతతో సేవ్ శ్రీశైలం అంటూ ముందుకు సాగుతూ మీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వంకు మా విన్నపం.



## మాజీ కౌన్సిలర్ కన్నమ్మ ఆధ్వర్యంలో

# బ్లడ్ అచ్చు అధ్యక్షతన రక్తదాన కార్యక్రమం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:**
పట్టణంలోని 1వ వార్డు హరిజన పేటలో గణేషుని 3వ రోజును పురస్కరించుకుని మాజీ కౌన్సిలర్ కన్నమ్మ ఆధ్వర్యంలో బ్లడ్ అచ్చు అధ్యక్షతన ఘణంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హుస్సేన్ ని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా రక్తదానాన్ని ఇచ్చేందుకు ఎక్కువ సంఖ్యలో స్వతంత్రంగా యువకులు పాల్గొని రక్తదానాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా బ్లడ్ అచ్చు మాట్లాడుతూ మాజీ కౌన్సిలర్ కన్నమ్మ వినాయక చవితిని పురస్కరించుకొని భక్తి తో పాటు ఇలాంటి రక్తదానా సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా మంచి పరిణామన్నారు. రానున్న కాలంలో మాజీ కౌన్సిలర్ కన్నమ్మ ఇంకా ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారికి తన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని బ్లడ్ అచ్చు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కన్నమ్మ మాట్లాడుతూ వినాయక చవితిని పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి గర్భిణిలకు, చిన్న పిల్లలకు ఆపత్కాల సమయాల్లో ఇబ్బంది లేకుండా ఉండాలని రక్తహీనతను పారద్రోలాలని ముఖ్య ఉద్దేశ్యముతో ఈ శిబిరం ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన దాతలకు, వార్డు సభ్యులకు, ముఖ్యంగా రక్తదాన కార్యక్రమాని పిలవగానే ఇక్కడికి వచ్చి రక్తదానం చేసిన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం గురించి బ్లడ్ అచ్చు కు తెలిపగానే వెంటనే స్పందించి తమకు ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినందుకు బ్లడ్ అచ్చుకు కృతజ్ఞతలు, తెలియజేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం. హుస్సేన్ తమ్ముడు, మొహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంకు తమను పిలిచి ఈ సదవకాశాన్ని కల్పించిన మాజీ కౌన్సిలర్ కన్నమ్మ కు కృతజ్ఞతలు, దన్యవాదాలు తెలిపారు. ఈ విదంగా కుల, మతాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలలో భాగం కావడం చాలా సంతోషకరమని, ఇది చాలా మంచి పరిణామం అని మాజీ కౌన్సిలర్ కన్నమ్మకు తమవంతు సహాయ, సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని అన్నారు.
మెగా ఫ్యామిలి సీనియర్ అభిమాని సురేష్ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలను ఏర్పాటు చేసిన మాజీ కౌన్సిలర్ కన్నమ్మ కు కృతజ్ఞతలు తెలిపారు. కన్నమ్మ గతంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు.
ఇంతకు ముందు కూడా గతంలో 1వ వార్డు లో తాగేందుకు నీరు లేకుంటే వాటర్ ట్యాంక్ లను తెప్పించి రాజకీయలకు అతీతంగా ప్రతి ఇంటికీ త్రాగు నీరు అందించారని, మాజీ ఎమ్మెల్యే శిల్పా కుటుంబంతో మంచి సత్సంభాలతో ఇప్పటికి, ఎప్పటికీ నిలిచిపోతారని వారికి దేవుని ఆశీస్సులతో పాటు వార్డు ప్రజలందరి అభిమానాలు ఎప్పటికీ ఉంటాయని భవిష్యత్తులో ఇలాంటి మంచి కార్యక్రమాలను ఎన్నో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహానంది, నాగరాజు, సుబ్బారాయుడు, మల్లి, ఆది, సురేష్, రాజు, కిరణ్, శివ, మల్లికార్జున, మధు, భరత్, వంశీ, శివ శంకర్ , ప్రశాంత్, జమ్మి సూరయ్య, రుద్ర నగేష్, గణా, నారి తో పాటు పలువురు ఈకార్యక్రమంలో పాల్గొని రక్తదానాన్ని ఇచ్చారు.

# పెండింగ్ అర్జీల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు.

## జిల్లాలో ఇప్పటి వరకు 41,247 వినతులు స్వీకరణ.

## పిజిఆర్ఎస్ వినతులు 38,862 పరిష్కారం. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు, 29:**
పిజిఆర్ఎస్ పెండింగ్ అర్జీల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ కంట్రోల్ రూమ్ నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పిజిఆర్ఎస్ అర్జీలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించడంతోపాటు అర్జీదారుడు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు సిబ్బందికి సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా జూన్ 2024 నుండి ఇప్పటి వరకు 41,247 వినతులను స్వీకరించగా, అందులో 38,862



వినతులను పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన అర్జీలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించడం జరిగింది. కాగా ప్రజా వినతులకు సరైన సమాధానాలు ఇవ్వని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఉన్న 230 మంది అధికారులకు మెమోలు జారీ చేసి 13,403 వినతులను వారిపై అధికారులు రీ ఓపెన్ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కంట్రోల్ రూమ్ నందు ప్రజా వినతులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారని స్వయంగా పరిశీలించడం జరిగింది. అదేవిధంగా ఫోన్ ద్వారా కొంతమంది అర్జీదారులతో మాట్లాడి వారి సమస్య పరిష్కారం అయిందా లేదా అర్జీదారుడు సంతృప్తి చెందారా లేదా అని వారి నుండి అభిప్రాయాలను సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని సంబంధిత అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో నంద్యాల జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పిజిఆర్ఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ కంపెనీలకు కేటాయించిన భూములను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్.

**ఆంధ్ర ప్రగతి పాణ్యం, కొలిమిగుండ్ల, ఆగస్టు 29:**
పాణ్యం, కొలిమిగుండ్ల మండలాలలో సోలార్ కంపెనీలకు కేటాయించిన భూములను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ....పాణ్యం మండలంలో ఎ.యం గ్రీన్ సోలార్ కంపెనీకి అదేవిధంగా కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు, తిమ్మనాయునిపేటలో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ కు సంబంధించి గతంలో భూములు కేటాయించడం జరిగింది. ఈ భూములకు



సంబంధించి ఎలాంటి ఎన్ క్రోచ్ మెంట్ లు లేకుండా చూడాలని సంబంధిత తహసిల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలకు సూచించారు. సర్వే నెంబర్ల వారీగా కేటాయించిన భూమికి సంబంధించిన మ్యాపును జెసి క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాణ్యం, కొలిమిగుండ్ల మండలాల తహసిల్దార్ లు, వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషాదినోత్సవమును వైభవంగా జరుపుకున్న బాల అకాడమీ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:** నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠాశాలలో ఆగష్టు 29 వ తేది అనగా శుక్రవారము తెలుగు భాషాదినోత్సవమును మరియు స్పోర్ట్స్ డే ఘనంగా చేయడము జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పాఠాశాల డైరెక్టర్ రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ శ్రీమతి మాధవి లత మేడం గారు మాట్లాడుతూ దేశీ భాషలయందు తెలుగు భాష లెస్స' అని కీర్తించడ బడిన మన తెలుగు భాష. అజంత భాష అనీ, గ్రాంధిక భాషలోని తెలుగు భాషను వ్వవహారిక భాషలోనికి రావడానికి నిరంతం కృషి చేసిన గిడుగు రామ్మూర్తి జయంతినే మనం తెలుగు భాష దినోత్సవముగా జరుపుకుంటున్నాము. పిల్లలు మానసికంగా, శారీరకంగా ఉత్సాహంగా ఉండాలంటే స్పోర్ట్స్ (క్రీడలు) చాలా అవసరం స్పోర్ట్స్ యొక్క ప్రాముఖ్యత ను గురించి తెలియజేసిన ప్రముఖ హాకీ ఆటగాడు అయిన ధ్యాన్ చంద్ జన్మదినం కూడా ఆగష్టు 29 వ జరుపుకోవడము జరుగుతుంది అందుకే ఈ రోజున స్పోర్ట్స్ డే జరుగుకోవడము జరుగుతున్నదని పాఠాశాల చిన్నారు తమదైన శైలిలో ఉపన్యాసాలు మరియు పొడుపు కథలు, ఇంకా అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా జరుపుకోవడం జరిగినది. అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:**
ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు %ఉ% భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. నేడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా



స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ మెహబూబ్ భాషా కు ఆర్థిక సహాయం.

**ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం భాషాకు సొంత నిధులు రూ. 25 వేల ఆర్థిక సాయం చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.**



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె ఆగస్టు 29:** బనగానపల్లెకు చెందిన షేక్ మెహబూబ్ భాషాకు తన సొంత నిధులు నుంచి రూ. 25 వేల ఆర్థిక సాయంను రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అందజేశారు. ఈ రోజు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో బనగానపల్లె పట్టణం.. బీసీ కాలనీకి చెందిన ఫంక్చర్ షాపులో పనిచేసే మెహబూబ్ భాషా అనారోగ్యంతో బాధపడుతున్న క్రమంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 25 వేలు ఆర్థిక సాయాన్ని తన చేతులు మీదుగా మంత్రి అందజేయడం జరిగింది. సాధారణంగా బనగానపల్లెలో బీసీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్మిక బీమా పథకంలో నమోదు చేసుకున్న వారు ఏదైనా ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి రూ. 1 లక్ష ఆర్థిక సాయం, ఏదైనా యాక్సిడెంట్ జరిగితే తక్షణ వైద్య సాయం కోసం దాదాపు రూ. 20 వేలు వరకు సాయం అందించడం ద్వారా బనగానపల్లె నియోజకవర్గ ప్రజల జీవితాల్లో ధీమా కల్పించడం జరుగుతోంది. అయితే కార్మిక బీమా పథకంలో నమోదు కాకుండా, అనారోగ్యంతో ఇబ్బంది పడే కుటుంబాలను.. మంత్రి తన సొంత నిధులతో ఆదుకోవడం జరుగుతోంది. ఇందులో భాగంగానే నేడు మెహబూబ్ భాషాకు రూ. 25 వేలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. నిస్వార్థంగా, సేవా దృక్పథంతో మంత్రి ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు కష్టాల్లో అండగా నిలవడంతో పాటు, ఆపత్కాలంలో ఆదుకుంటున్న తీరుపై బాధిత కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

# ఆగష్టు 29 న తెలుగు భాషా దినోత్సవం,జాతీయ క్రీడా దినోత్సవం.



**ఆంధ్ర ప్రగతి డోన్ ఆగస్టు 29:** ఆగష్టు 29న శ్రీ గిడుగు వెంకట రామమూర్తి గారి జయంతి మరియు శ్రీ ద్యాన్ చంద్ హాకీ క్రీడాకారుడు జయంతుల సందర్బంగాడోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆద్వర్యంలో ఆగష్టు 29 న - శ్రీ గిడుగు వెంకట రామమూర్తి జయంతి మరియు శ్రీ ద్యాన్ చంద్ హాకీ క్రీడాకారుడు గారి జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళులు అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ సందర్బంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ లిమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. 1) తెలుగులో వాడుక భాషా ఉద్యమపితామహుడు గిడుగు వెంకటరామమూర్తి శ్రీకాకుళం జిల్లా లో ఆగష్టు 29, 1863 జన్మించారు. గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త. శిష్టజన వ్యవహారికభాషను గ్రంథరచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చింది. గిడుగు రామ్మూర్తి జయంతి ఆగష్టు 29 ని "తెలుగు భాషా దినోత్సవం"గా జరుపుకుంటున్నాము. ఈయన22-1-1940లో స్వర్గస్తులైనారు. 2) ధ్యాన్ చంద్ భారతీయ మైదాన హాకీ క్రీడాకారుడు.ధ్యాన్ చంద్ 1905 ఆగస్టు 29 జన్మించారు. సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకడు. గోల్స్ చేయడంలో మంచి ప్రతిభ కనబరిచేవాడు. భారతదేశానికి హాకీలో స్వర్ణయుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టాడు. ఆయన జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుతున్నారు. ఈయన 3-12-1979న స్వర్గస్తులైనారు. ఇలాంటి మహానుభావులను అనుసరించి వారి ఆశయాలను కొనసాగించాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం.

**కే.ఎన్.ఎం. పురపాలక పాఠశాలకు క్రీడా పరికరాల పంపిణీ.**

**లయన్స్ క్లబ్ యూత్ బ్యాచ్ సౌజన్యంతో.**

**విద్యార్థులను చదువుతోపాటు క్రీడలలో ప్రోత్సహించాలి: డాక్టర్ రవి కృష్ణ.**



**జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కేఎన్ఎం పాఠశాలకు క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్న నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యులు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం హాకీ మాంత్రికుడు పద్మభూషణ్ ధ్యాన్ చంద్ జన్మదినోత్సవం సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం స్థానిక కేఎన్ఎం పురపాలక పాఠశాలలో నిర్వహించారు. ముందుగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఒలింపిక్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు క్రీడలలో కూడా ప్రోత్సహించాలని పాఠశాల యాజమాన్యాలను తల్లిదండ్రులను కోరారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక వికాసం కలుగుతుందని, ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుందని అన్నారు. ధ్యాన్ చంద్ జీవిత విశేషాలు వివరించారు. ఈ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ యూత్ బ్యాచ్ సౌజన్యంతో 15 వేల రూపాయల విలువ చేసే క్రీడా పరికరాలు పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అసదుల్లా, జోన్ చైర్మన్ నిజాముద్దీన్, సీనియర్ సభ్యులు భవనాసి నాగ మహేష్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు కూర ప్రసాద్, పోసిన సుబ్బారావు, కోశాధికారి అమిదేల జనార్ధన్,సుజిత్, రాజ్ పవన్, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి రైతు ఆర్తనాదాలు..!

**కేజీ ఒక్క రూపాయికి పడిపోయిన దుస్థితి.**

**వారం రోజుల నుంచి కొనే దిక్కు లేక మార్కెట్ యార్డ్ లో వేచి చూస్తున్న రైతులు.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు ఆగస్టు 29:** యార్డును సందర్శించి రైతులకు ధైర్యం చెప్పిన కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల భరత్ కుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్లు సురేందర్ రెడ్డి.

కష్టపడి పండించిన పంట అమ్మితే కనీసం ఆటో బాడిగలకు రాలేదని వాపోయిన రైతులు, ఒక ఎకరా ఉల్లిని పండించడానికి లక్ష నుండి 1,30,000 ఖర్చు అవుతుందని కానీ పంట 50 నుంచి 70 క్వింటాలు వచ్చినా మార్కెట్లో క్వింటాల్ 100 నుంచి 300 మాత్రమే ధర పలుకుతుందని ఈ విధంగా అయితే ఒక ఎకరాకు 20 నుంచి 30 వేలు మాత్రమే చేతికొస్తాయని రైతులు కన్నీరు మున్నీరయ్యారు..జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఉల్లి ధర తగ్గితే ప్రభుత్వం కొనుగోలు చేసి రాష్ట్రంలో ఉన్నటువంటి రైతు బజార్ల ద్వారా విక్రయించి రైతులను ఆదుకుందని కానీ కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని వాపోయారు. ఒకవైపు ఎరువులు లేక పురుగుమందుల ధరలు పెరిగి ఎంతో కష్టపడి పంట పండిస్తే కనీసం కూలీ ఖర్చులకు చెల్లించలేని దుస్థితి నెలకొందని మార్కెట్ యార్డ్ నుంచి ఇంటికి వెళ్లలేని పరిస్థితిలో ఉన్నామని రైతులు మొరపెట్టుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మహత్యలే శరణ్యమని రైతులు చెప్తే..ఎస్వీమోహన్ రెడ్డి భయపడొద్దు అలాంటి తప్పుడు ఆలోచనలు చేయవద్దని మీకు అండగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగన్ మోహన్ రెడ్డి ఉంటారని మీకోసం పోరాడుతారని ధైర్యం చెప్పారు. ఎస్వీ మోహన్ రెడ్డి గారు మాట్లాడుతూ గతంలో పొగాకుకు ధర పడిపోతే జగన్ మోహన్ రెడ్డి ఒంగోలు రైతులను పరామర్శిస్తే అప్పుడు ప్రభుత్వం మేల్కొందని, మిర్చికి ధర పడిపోతే జగన్ మోహన్ రెడ్డి గుంటూరు మార్కెట్ యార్డుకు వెళ్తే ప్రభుత్వం కదిలిందని, మామిడి ధర పడిపోతే రైతులను జగన్ మోహన్ రెడ్డి పరామర్శిస్తే కేంద్ర ప్రభుత్వం కదిలిందని కావున ఉల్లి రైతుల కోసం కూడా జగన్ మోహన్ రెడ్డి అండగా ఉంటాడని తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే ఉల్లిని రూ. 2,000 నుంచి రూ. 5,000 వరకు కొనుగోలు చేసి రాష్ట్రంలో రైతు బజార్లలో విక్రయించాలని డిమాండ్ చేశారు. వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ప్రధానమైన పంట ఉల్లి పంట అని రాష్ట్రంలో సాగు జరిగే ఉల్లిలో 90% కర్నూల్ జిల్లాలోనే సాగు చేస్తారని సంవత్సరంలో మార్కెట్ కు వచ్చే మొట్టమొదటి పంట కూడా ఉల్లి పంటనే అని సీజన్ మొదట్లోనే ఈ పరిస్థితి ఉంటే ఇంకా 50 రోజుల పైన ఉల్లి పంట మార్కెట్ కి వస్తుందని వారం రోజుల నుంచి రైతులు అష్టకష్టాలు పడుతున్నారని కనీసం వారి వైపు ప్రభుత్వం కాని అధికారులు కానీ చూసిన దాఖలాలు లేవని విమర్శించారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఉల్లిని కొనుగోలు చేసి రైతులను ఆత్మహత్యల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, మల్లికార్జున, తిరుమలేష్ రెడ్డి, రైతు భాగం కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ నాయకుడు షరీఫ్, నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# బేతంచెర్ల పట్టణంలో త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలి.

**పట్టణంలో ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలి.**

**మున్సిపల్ ఆఫీసులో జరిగే అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి.**

**వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నందు ధర్నా.**




**ఆంధ్ర ప్రగతి బేతంచెర్ల ఆగస్టు 29:** బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలో ఆయా కాలనీలలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్ సిపిఎం మండల కార్యదర్శి మధుశేఖర్ ల ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్, సిపిఎం మండల కార్యదర్శి మధు శేఖర్, సిపిఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ లు మాట్లాడుతూ... పట్టణంలో నెలకొన్న త్రాగునీటి సమస్యలతో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో బేతంచర్ల పట్టణంలో విష జ్వరాలు ప్రబలిపోయి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని నిత్యం దోమల ఈగల సంగీత వాయిద్యాలతో నరకయాతన చూస్తున్నారని సుమారు నెల రోజుల కిందట పట్టణంలో విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టి ఈగలు దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలి అని కమిషనర్ కు విన్నవించుకున్న ఈ రోజుకు కూడా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఏదైనా ధృవీకరణ పత్రాలు అవసరమై మున్సిపల్ కార్యాలయానికి వస్తే చిన్న పనికి సైతం నెలల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉందని పట్టణంలో రెక్కాడితే కానీ డొక్కాడని దినసరి కూలీలు వారి పనిని వదిలిపెట్టి ఆఫీసులో చుట్టూ తిరిగి ఆర్థికంగా చితికి పోతున్నారని, చిన్న పనికి సైతం కార్యాలయంలో అవినీతి పెచ్చుమీరిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు, కుక్కల దాడుల్లో చిన్నపిల్లవాడు మరణించిన అనేకమార్లు కుక్కల దాడులు పునరావృతం అవుతున్న కుక్కలు నియంత్రిస్తున్నామని చెప్పి కేవలం ప్రకటనలతో కాలం వెళ్లబుచ్చుతున్నారని, మరోవైపు పందులు ఆవులు పట్టణ పురవీధుల గుండా తిరగడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతూ అనేక ప్రమాదాలు జరిగి కాళ్లు చేతులు విరకొట్టుకుని ఇల్లలో ఉండాల్సిన పరిస్థితి ఉందని మరికొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయే తీవ్రమైన పరిస్థితులు ఎదురవుతున్నాయని, అనేక కాలనీలలో లైట్లు వెలగక చీకట్లో ఎప్పుడు ఏ విషపురుగు కరుస్తుందని భయం గుప్పెట్లో ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని బ్రతకాల్సిన పరిస్థితి ఉందని పేద ప్రజల ప్రాణాలు అంటే లెక్క లేకుండా ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించే నాయకులను ప్రభుత్వ అధికారిక, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమాజ అభివృద్ధి కోసం పాటుపడే జర్నలిస్ట్, ప్రజాసంఘాల నాయకులను అనుచితంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు ప్రభుత్వ కార్యాలయాలలో పని నిమిత్తం వచ్చిన సాధారణ మధ్యతరగతి ప్రజలను గంటల తరబడి బయటనే నిలబెట్టి అధికార పార్టీ నాయకులను ఆఫీసుల్లో కూర్చోబెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే ప్రభువులు అన్న సిద్ధాంతానికి వ్యతిరేకంగా ప్రభుత్వ అధికారులను సైతం నాయకులు ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు ఇప్పటికైనా మున్సిపల్ పరిధిలో తిష్టవేసిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు నిరసన కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు ప్రదీప్, మధు, శ్రీకర్, ఫారుక్, ఖదీర్, శ్రీమన్నారాయణ, బాలు, గోపి, కార్తీక్, ప్రసాద్, మహమ్మద్, నాగసాయి, మధు, రామాంజనేయులు, ఖాజా హుస్సేన్, ఎస్ కే భాష, మద్దిలేటిస్వామి, నాగరాజు, వెంకటరమణ, టింగు తదితరులు పాల్గొన్నారు.

# బషీర్బాగ్ విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం.

**సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:** 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని వామపక్ష పార్టీలు మరియు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని బషీర్బాగులో విద్యుత్ పోరాటం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అప్పటి టిడిపి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో వామపక్ష పార్టీల నాయకులపైన మరియు విద్యుత్ ఆందోళనకారులపై పోలీసులు విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో ముగ్గురు కామ్రేడ్స్ అమరులు కావడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డి రామకృష్ణ మరియు బాలస్వామి అనే కామ్రేడ్స్ ఆత్మ బలిదానాన్ని స్మరించుకుంటూ 25వ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది శుక్రవారం స్థానిక మీనాక్షి సెంటర్ నందుని ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం యూనియన్ కార్యాలయ ఆవరణంలో జరిగిన కార్యక్రమానికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ నంద్యాల డివిజన్ కార్యదర్శి ఎం శంకర అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో గత ప్రభుత్వ పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చారని అయితే అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం అవుతున్నప్పటికీ తగ్గించకపోగా ట్రూ అఫ్ ఛార్జీల పేరిట మరియు స్మార్ట్ మీటర్ల పేరిట విద్యుత్ సంస్కరణలను ప్రవేశపెట్టడానికి మరియు విద్యుత్ పంపిణీ ప్రైవేట్ కరించి కార్పోరేట్ వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆయన ఆరోపించారు తక్షణమే పెంచిన ట్రూ అఫ్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. గతంలో విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సంఘటనను గుర్తించుకోవాలని లేని పక్షంలో భవిష్యత్తులో అన్ని వామపక్ష పార్టీలు ప్రజా సంఘాల పెద్ద ఎత్తున కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బషీర్బాగం విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమాల కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి ఏ రాంబాబు ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు రాజు సాయి లక్ష్మయ్య చాంద్ బాషా ఏఐకేఎంఎస్ నాయకులు మోహన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇరా జాతీయ కార్యదర్శి యలనాటి జాషువా జన్మదిన వేడుకలు





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:** నంద్యాల పట్టణం ఇండియన్ రిపోర్టర్ అసోసియేషన్ కార్యాలయంలో ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి జాషువా యలనాటి పుట్టినరోజు వేడుకలను.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరా అధ్యక్షులు పి.జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.శరత్ బాబు,రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ బాబు, జిల్లా అధ్యక్షులు లెజెండ్ శీను,కార్యవర్గ సభ్యులు విజయానంద్,జి.సురేష్ బాబు,విజయ్ కుమార్,ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తూ కేక్ కటింగ్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులంతా ఒకే కుటుంబమని కుటుంబంలో సంతోషాన్ని కష్టాలను కూడా అదే విధంగా పంచుకుంటామని జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి పని చేసే సంస్థ ఏదైనా ఉందంటే అది ఒక ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ మాత్రమేనని ఆయన అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కార దశగా పోరాటం చేస్తామని. జర్నలిస్టులకు అండగా ప్రతి సమస్యలోనూ నిలబడతామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. పుట్టినరోజు వేడుకలకు జర్నలిస్టులు స్నేహితులు పోన్నాపురం ప్రసాద్,రాజశేఖర్,అరుణ్,ఆనంద్, తదితరులు హాజరై పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ జి టి ఆర్ యం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం.

**కళాశాల శ్రీనివాసులు.**







**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల ఆగస్టు 29:** మండల పరిధిలోని స్థానిక శ్రీ గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎర్రగుంట్ల నందు శ్రీ గిడుగు రామ్మూర్తి గారి జన్మదినోత్సవ సందర్భంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలను కళాశా లలో ఘనంగా నిర్వహించ డమైనది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈయన 1863 సంవత్సరం ఆగస్టు నెల 29వ తేదీన శ్రీకాకుళం జిల్లాలోని పర్వతాల పేటలో జన్మించారు. ఈయన తెలుగు భాషను గ్రాంధిక భాష నుండి సరళంగా వాడుకునే వాడుక భాషగా తెలుగు భాషను తీసుకు రావడం కొరకు ఎంతో కృషి చేయడమైనది. కావున ఈయన జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం గా జరుపు కోవడం జరిగింది. ఈ కార్యక్ర మంలో తెలుగు లెక్చరర్ నాగేశ్వరి డిగ్రీ కళాశాల లెక్చరర్ పున్నారావు, మా కళాశాల టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిన్నెల్లి సోదరులకు హైకోర్టు షాక్ ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

అమరావతి,ఆగస్ట్29:

పిన్నెల్లి సోదరులకు హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులకు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది.బెయిల్ విషయంలో ఊరట దక్కలేదు. టీడీపీ నేతల జంట హత్య కేసులో పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. మాచర్లకు సమీపంలో జరిగిన జంట హత్యల కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, వెంకటరామిరెడ్డి పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం.. కొట్టివేసింది. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పరారీలో ఉన్నాడు. తెదేపా నేతల జంట హత్యల కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో వారిద్దరూ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. వారి పిటిషన్‌ను కొట్టివేసింది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెదేపా నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్యలో పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రత్యక్ష సాక్షి, మృతుల బంధువు తోట ఆంజనేయులు ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశారు. ఏ1గా జవిశెట్టి శ్రీను ఎలియాస్ బొబ్బిలి, ఏ2గా తోట వెంకట్రామయ్య, ఏ3గా తోట గురవయ్య, ఏ4గా దొంగరి నాగరాజు, ఏ5గా తోట వెంకటేశ్వర్లు, ఏ6గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ7గా పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను పేర్కొన్నారు. జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్యలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుల పాత్ర ఉందని, అందుకు ఆధారాలున్నాయని పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఆగస్టు 21న హైకోర్టులో వాదనలు వినిపించారు.

## గగ్గటూరులో ఘనంగా వినాయక చవితి వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి పాణ్యం ఆగస్టు 29:** నంద్యాల జిల్లా పాణ్యం మండలం గగ్గటూరుగ్రామంలో బానసంచాలో పేలుస్తూ డప్పు వాయిద్యాల నడుమ కుంకుమలు చల్లుకుంటూ వసంతాలతో ఊరేగింపుగా గ్రామస్తులంతా కలసిమెలసి ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గగుటూరు వైసిపి సీనియర్ నాయకులు హెల్పింగ్ %ఢ% సొసైటి అధ్యక్షులు సద్దల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కంటే ఎంతో ఉత్సాహంగా ఇతర జిల్లాల నుండి పట్టణాల నుండి ఇతర ప్రాంతాల నుండి గగటూరు గ్రామానికి చేరుకొని గ్రామ ప్రజలు గణనాథుని నిమర్జనం వేడుకలో పాల్గొనడం శుభ పరిణామం అన్నారు. గ్రామస్తుల ఐక్యత కలిగి ఉండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు గగుటూరు గ్రామంలో వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన వేలం పాటలో ఈ సంవత్సరం 41,000 వేల రూపాయలకు పాడిన గగ్గటూరు గ్రామ నాయకుడు సద్దల శివ మోహన్ రెడ్డి గణేష్ లడ్డూను వేలంపాట పాడి లడ్డు ను దక్కించుకున్నారు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ నిమజ్జనోత్సవం కుల మత లకు అతీతంగా పార్టీలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో ఉత్సాహ ఉల్లాసాలతో విజయవంతంగా ముగిసింది అని తెలిపారు.

## నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం.

**రేవణ సిద్ధాంతి, డాక్టర్ కిషోర్,రామ సుబ్బారెడ్డి, ప్రభాకర్ రెడ్డి లకు లయన్స్ క్లబ్ తెలుగు భాషా దినోత్సవ పురస్కారాల ప్రదానం.**

**తెలుగు భాషా వికాసానికి అందరూ కృషి చేయాలి: డాక్టర్ సహదేవుడు.**

**తెలుగు భాష ఔన్నత్యం గొప్పది: డాక్టర్ రవి కృష్ణ.**



తెలుగు భాష దినోత్సవ పురస్కార గ్రహీతలతో నంద్యాల లయన్స్ క్లబ్ ప్రతినిధులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గిడుగు శ్రీరామ్మూర్తి పంతులు జన్మదినం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం స్థానిక కేఎన్ఎం పురపాలక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు శ్రీరామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు సౌజన్యంతో లయన్స్ క్లబ్ తెలుగు భాషా దినోత్సవ పురస్కారాలను అందజేశారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న డాక్టర్ సహదేవుడు, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గిడుగు శ్రీరామ్మూర్తి పంతులు తెలుగు వ్యావహారిక భాషను ప్రోత్సహించారని, సవరలకు వారి భాషకు లిపిని రూపొందించిన మహనీయుడని కొనియాడారు. పురపాలక పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేసిన రేవణ సిద్ధాంతి, కవి డాక్టర్ కురుమేటి కిషోర్, పురపాలక పాఠశాల తెలుగు అధ్యాపకులు రామసుబ్బారెడ్డి,ప్రభాకర్ రెడ్డి లను శాలువా, పూలమాల, పురస్కార జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల బాలికలు ఆలాపించిన తెలుగు భాష ఔన్నత్యం గేయాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అసదుల్లా, జోన్ చైర్మన్ నిజాముద్దీన్, సీనియర్ సభ్యులు భవనాసి నాగ మహేష్,ఉపాధ్యక్షులు కూర మురళీకృష్ణ ప్రసాద్, పోసిన సుబ్బారావు, కోశాధికారి అమిదేల జనార్ధన్,యువజన విభాగ సభ్యులు సుజిత్ రాఘవ, రాజ్ పవన్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వభాషను ప్రేమిద్దాం..స్వదేశీ వస్తువులను కొందాం

## అనే నినాదం మనకు ఆదర్శం కావాలి. - ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి చైర్మన్. శ్రీ రామకృష్ణ విద్యా సంస్థలు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:** నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 29 శుక్రవారం నాడు తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు మాతృభాషా దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి సభా అధ్యక్షుడిగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల పట్టణం ప్రముఖ వైద్యులు, సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు, మరియు సీనియర్ న్యాయవాది, సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీ శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. ముందుగా డాక్టర్ గెలివి సహదేవుడు మాట్లాడుతూ "మాతృభాషే మన వ్యక్తిత్వానికి ప్రతిబింబం. మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు మాతృభాషే బలమైన పునాది. మన తెలుగు భాష ప్రపంచంలో మధురమైన భాషగా గుర్తింపు పొందింది. ప్రతి విద్యార్థి మాతృభాష పట్ల గౌరవం పెంపొందించుకోవాలి" తెలుగు ఇస్ ద ఇటాలియన్ అఫ్ ది ఈస్ట్ గా అందరి చేత ప్రశంసలు పొందినది మన తెలుగు భాష అని అన్నారు. తెలుగు భాష పట్ల మమకారం ఉండాలి విద్యార్థులకు కనీసము 50 పద్యాలైన కంఠస్థం చేయాలి. వేమన వంటి కవుల పద్యాలలో కానీ శతక పద్యాలలో కానీ జీవితానికి సంబంధించిన అనేకమైన విషయాలు ప్రతిబింబిస్తాయి. కాబట్టి శతక పద్యాలు వేమన పద్యాలు కంఠస్థం పట్టడం వలన జీవితంలో కష్టకాలంలో కూడా మనకు మనోధైర్యాన్ని అతని శ్వాసాన్ని కలిగించి మనలను ముందుకు నడిపిస్తాయి.

ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులుగారు తెలుగు భాషకు సేవకు చేసిన చిరస్మరణీయము. తల్లి భాష వంటి మాతృభాషలు మన వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడతాయి అని అన్నారుసీనియర్ న్యాయవాది సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ "తెలుగు భాషకు 2008లో ప్రాచీన శాస్త్రీయ భాష హోదా లభించింది. ఇది ప్రతి తెలుగు వారికీ గర్వకారణం. భాషను కాపాడుకోవడం అంటే మన సంస్కృతిని కాపాడుకోవడం" అని పేర్కొన్నారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగును వ్యవహారిక భాషాగా ఈరోజు మనమందరం మాట్లాడుతున్నామంటే దీనికి కారణము ఆనాడు గిడుగు రామ్మూర్తి పంతులుగారు చేసిన సేవయే. ఎంతో వ్యయ ప్రయాసలు కూర్చి ఆంధ్రదేశంలో ఉన్న సవర, కువి, కుయి వంటి గిరిజన భాషలను సేకరించి వాటికి లిపిని గూర్చి తెలుగు భాషకు వ్యవహారిక హోదాను కలిగించే ప్రయత్నం చేశారని వీరీ ప్రయత్నాన్ని ముందుకు తీసుకుని వెళ్ళిన వారు గురజాడ అప్పారావు కందుకూరి వీరేశలింగం పంతులు. ఈనాడు విద్యార్థులు ప్రాచీన కవిత్వంలో ఉన్న తెలుగు మాధుర్యాన్ని చవిచూస్తూ నేడు మనము మాట్లాడుతున్న వ్యవహారిక భాషను కూడా ఆదరిస్తూ కవితలు రాయటం చక్కగా మాట్లాడటం అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో ప్రముఖమైన విషయము ప్రాంతీయ భాషలను ఆదరించడం భారతదేశంలోని అత్యంత ప్రాచీనమైన సంస్కృతము ప్రాకృతము వంటి భాషలకు పూర్వ వైభవాన్ని తీసుకొని వస్తూ ప్రాంతీయ భాషలను ప్రోత్సహిస్తూ అనేక సంస్కరణలు తీసుకొని వస్తుందని ఇది విద్యార్థులు గమనించాలని, తెలుగు వంటి మాతృభాషల ఉన్న ఆంధ్రదేశంలో కోలాటం, చెక్కభజన కూచిపూడి హరికథలు గద్దె చెప్పడం వంటి కళారూపాలు ఉన్నాయని వాటిని తిరిగి ప్రాచుర్యంలోకి తెచ్చుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని ఇందు కొరకు నేటి ప్రభుత్వాలు కూడా అనుకూలమైన దృక్పథముతో వ్యవహరిస్తున్నాయని అంతేకాకుండా కంప్యూటర్లో నూతన సాఫ్ట్వేర్ నీ అభివృద్ధి చేసి దాదాపు 14 భాషలలో అందుబాటులోనికి తీసుకొని వచ్చిందని ఆ టెక్నాలజీని విద్యార్థులందరూ నేటి ఆధునిక అవసరాలకు అనుగుణంగా వాడుకోవాలని, ఇంగ్లీషు భాషను ఆదరించు కానీ తల్లి భాష పట్ల మమకారము ఉండాలని అన్నారు. అంతేగాక బ్రిటిష్ వారు భారతదేశాన్ని పరిపాలిస్తున్నప్పుడు వారు మన ఆత్మవిశ్వాసము పైన దృఢసంకల్పం పైన సంస్కృతి పైన దాడిగా ఇంగ్లీషు భాషను ప్రవేశపెట్టారని ఇంగ్లీషు భాషను నేర్చుకున్నంత మాత్రాన మన సంస్కృతిని మరిచిపోకూడదని మన కళ లను ఆదరించాలని ఆ దిశగా ప్రయత్నాలు చేస్తూ అలాంటి స్ఫూర్తిని విద్యార్థులలో తీసుకొని రావడానికి ఈరోజు తెలుగు మాతృభాషా దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు స్ఫూర్తి పొందుతారని శుభాకాంక్షలు తెలియజేశారు.

కళాశాల ప్రిన్సిపల్ శ్రీ సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు గిడుగు రామ్మూర్తి పంతులుగారు చేసిన సేవలను తెలుసుకోవాలని మాతృభాషల వల్ల సంపూర్ణమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందని ఉన్నత విద్యా ఉద్యోగ అవకాశాలు కూడా సులభంగా పొందుతారని అన్నారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అకాడమిక్ శ్రీమతి ప్రగతి మాట్లాడుతూ ఉన్నత విద్య వృత్తి అవసరాల కోసము మరియు నవీన సాంకేతిక కాలంలో ఇంగ్లీష్ వంటి భాషలు ఎంత అవసరమో మాతృభాషలు కూడా అంతే అవసరం. మాతృభాష అమ్మ వంటిది. అందువలన త్రిభాషా సూత్రాన్ని పాటిస్తూ అంతర్జాతీయ జాతీయ భాషలతో పాటుగా తప్పనిసరిగా తెలుగు వంటి మాతృభాషలో పైన మంచి పట్టును సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ గెలివి సహదేవుడు ని, శ్రీ శ్రీనివాసమూర్తి ని కళాశాల యాజమాన్యం మేమెంటో శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ఆలపించిన తెలుగు పాటలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ లలితా సరస్వతి శ్రీ మోహన్ రావు, శ్రీకాంత్, మస్తాన్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.

# రైతులకు దెబ్బమీద దెబ్బ!

## యూరియా సరఫరాలో అరకొర కేటాయింపులు -రైతుల అవస్థలు పట్టించుకోని ప్రభుత్వాలు

**ఆగస్టు 29 ఆంధ్ర ప్రగతి**
ఇప్పటికే యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడ్డ రైతులపై దెబ్బమీద దెబ్బ అన్నట్లుగా అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీసాయి. పలు జిల్లాల్లో విపరీతమైన భారీ వర్షాలతో పంటలన్నీ నీటమునిగాయి. వేసిన పంటలన్నీ నీటి పాలయ్యాయి. పెట్టుబడులు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయాయి. అనేక జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉత్తరాది రాష్ట్రాల్లోనూ ఇలాగే ఉంది. వరదలు వచ్చిన ప్రతిసారీ పంటనష్టం సకాలంలో అందడం లేదు. ప్రభుత్వం నష్టం అంచనా వేసి ఇచ్చే అరకొర పరిహారం కూడా ఎప్పుడు అందుతుందో తెలియదు. ఇకపోతే యూరియా సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. దీనిని బట్టి రైతులు ఎంతగా ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత మాత్రాన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టడం తగదు. బిజెపి నేతలు కూడా స్థానిక సమస్యపై చర్చించకుండా ఇక్కడి ప్రభుత్వంపైనే నిందలు వేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం పలుమార్లు విన్నవించినా పెద్దగా స్పందించలేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించిన ఎరువుల కోటాను పరిశీలిస్తే తెలంగాణపై కొంత పక్షపాతం చూపిస్తున్నట్టుగానే కనిపిస్తోంది. ఈ సంవత్సరం పంటల సేద్యం పెరగవచ్చుననే దృష్టితో రాష్ట్రం 20 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కోరితే, రాష్ట్రానికేంద్రం కేటాయించింది 9.80 లక్షల టన్నులు మాత్రమే. ఆగస్టు ఆఖరినాటికి 8.30 లక్షల టన్నులు సరఫరా చేయాల్సిఉండగా ఈనెల ఆఖరికి వచ్చింది 5.66 లక్షల టన్నులు మాత్రమే. ఆ వివరాలు వ్యవసాయశాఖ మంత్రి పత్రికా ముఖంగా వివరించారు. ఇంకా సుమారు 3 లక్షల టన్నుల లోటు ఉండటం.. సకాలంలో కేంద్రం సరఫరా చేయకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఎప్పటికప్పుడు వస్తున్న ఎరువులను మానిటరింగ్ చేస్తూ యూరియాను డిమాండ్ ఉన్న ప్రాంతానికి పంపిస్తున్నామని, రైతులు ఎరువులు దొరకవని ఆందోళన చెందనవసరం లేదని ప్రభుత్వంప్రకటించింది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నాయకులు.. పాలకుల వైఫల్యమే అంటూ, ఎరువులు సరఫరా చేయలేని చేతకాని ప్రభుత్వాలంటూ విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. విమర్శలు, మాటలు పక్కకుపెట్టి యుద్ధప్రాతిపదికన ఎరువులు సరఫరా జరిగేలా చూడమని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలు పరిశీలించకుండా రాష్ట్రంలో ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారు. రైతులు రాత్రింబవళ్లు సహకార బ్యాంకు గోదాముల వద్ద క్యూలైన్లో



ఉంటూ.. పట్టా పాస్ బుక్కులు, చివరికి చెప్పులు కూడా క్యూలైన్లలో పెడుతూ, లైన్ లో ఘర్షణలు పడుతూ, కొన్నిచోట్ల లాఠీచార్జీలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఎందుకు ఈ పరిస్థితి వచ్చింది? దీనికి బాధ్యులు ఎవరన్నది ఆలోచించాలి. రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటాయి. రాష్ట్రం గత ఏడాది వేసిన పంటలను దృష్టిలో పెట్టుకుని 10 శాతం విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఖరీఫ్ సీజన్ రాకముందే ప్రణాళిక రూపొందించి, 20 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు కావాలని కేంద్రాన్ని కోరింది. గతంలో ఇచ్చిన 2 లక్షల టన్నులు ఇప్పటికే రాష్ట్రం వద్ద నిల్వలు ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఎప్పటికప్పుడు పంపుతున్నామని.. రూ. 80,000 కోట్లు సబ్సిడీ భరించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. యూరియాపై ప్రభుత్వం భరిస్తున్న సబ్సిడీ ఎక్కువగా ఉంది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. చైనా నుంచే 20 శాతం దిగుమతి చేసుకోవాలి. సబ్సిడీని తగ్గించుకొనే ఎత్తులో భాగంగా తక్కువలో తెప్పించుకొనే ప్రయత్నం చేస్తుందని కేంద్రంపై విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా అన్నదాతలకు అగచాట్లు- తప్పట్లేదు. ప్రస్తుతం వేసిన పంటలకు 15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వాన్ని కోరుతోంది. దాంతో డిమాండు ఎక్కువగా ఉండి.. సరఫరా తక్కువగా ఉండటంతో.. పంపిణీ కేంద్రాల దగ్గర వేకువ జాము నుంచే పడిగాపులు కాస్తున్నప్పటికీ సరుకు కొంతమందికే అందటంతో ఆందోళన మొదలయ్యింది. డిమాండును అడ్డుపెట్టుకొని పలుచోట్ల నల్ల బజారు విక్రయాలు యధేచ్ఛగా రూ.266 బస్తాను రూ. 400 వరకు అమ్ముతున్నారని విమర్శలు వస్తున్నాయి. పారిశ్రామిక అవసరాల కోసం వ్యవసాయ యూరియాను దారి మళ్ళిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అతిగా రసాయన ఎరువుల వినియోగం, పంట మార్పిడి విధానం లేనందున నేలలో మంచి బ్యాక్టీరియా నశిస్తుంది. అతిగా నీరు పెట్టడం, ఎరువులు, రసాయనాలు వాడటం వల్ల భూసారం క్షీణిస్తుంది. రసాయన ఎరువులు, గుమ్మరిస్తే ఫల సాయం రెట్టింపు కాదు. దీనిపై రైతాంగంలో అవగాహన పెంచడంలో ప్రభుత్వాల వైఫల్యం.. మన ఆహార భద్రతనే ప్రమాదంలోనికి నడుతుంది. సాగు భూములను కాపాడుకోవాలంటే ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహిస్తూ, తగినంత పరిణామంలోనే ఎరువులు చల్లేలా అన్నదాతను చైతన్య పరచాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి హెచ్చరించింది. అయితే మోడీ నేతృత్వంలోని కేందప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క రైతు అనుకూల నిర్ణయం తీసుకోలేదు. అప్పుడప్పుడూ మద్దతు ధరలు పెంచడం తప్ప చేసిందేమీ లేదు. రైతుల సంఘాల నుంచి వ్యతిరేకతలు, ఆందోళనలు వస్తున్నా చర్చించడం లేదు. సాగుచట్టాలు తీసుకుని వచ్చాక అవి ఎందుకు మంచివో చెప్పలేక పోయింది. వాటిని రద్దుచేస్తున్న సమయంలోనూ ఎందుకు రద్దు చేస్తుందో చెప్పలేదు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా జాతీయ సాగు విధానం తీసుకుని రావవడంలోనూ.. దేశీయంగా పంటలను ప్రోత్సహించడంలోనూ విఫలమయ్యింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోడీ పండించిన పంటలను కొనుగోలు చేసే దిక్కు లేకుండా చేసింది. దేశీయంగా పంటలు పండుతున్నా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో రైతులు పోరుబాట పడుతున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడే విధానాలు రావాలి. అందుకు తగిన కృషి చేయాలి.

# లంబాడీ, సుగాలీ, బంజారాలు ఎస్టీలు కాదు

## వారిని జాబితా నుంచి తొలగించాలని పిటిషన్

### విచారణ చేపట్టిన సుప్రీం...కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

న్యూఢిల్లీ, **ఆగస్టు 29 ఆంధ్ర ప్రగతి**
లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలోనుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కాగా, దీనిపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చటంపై గతంలో తెలంగాణ హైకోర్టులో తెల్లం వెంకట్రావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ తెల్లం వెంకట్రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.లంబాడీ, సుగాలీ, బంజారాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మెరుగైన స్థానంలో ఉన్నారని పిటీషన్‌లో తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల



కోయ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎస్టీ జాబితా నుంచి వారిని తొలగించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరపున సుప్రీం కోర్టులో సీనియర్ అడ్వకేట్ అల్లంకి రమేష్ పిటిషన్ దాఖలు చేశారు. బంజారా, లంబాడాలు, సుగాలీలు గిరిజనులు కారని, 1976 వరకు ఉమ్మడి ఏపీలోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వచ్చి, అప్పటి నుంచి గిరిజనుల హక్కులను కొల్లగొడుతున్నారని పిటిషనర్లు తమ పిటిషన్ లో పేర్కొన్నారు. వాస్తవానికి మొదట బంజారా, లంబాడా, సుగాలీలు బిసి జాబితాలో ఉన్నారని కోర్టులో వేసిన పిటిషన్ లో తెలిపారు. పిటిషన్ విచారణ జరిపిన సుప్రీంకోర్టు జస్టిస్ జే కే మహేశ్వరి, జస్టిస్ బిష్ణోయ్ ధర్మాసనం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీ-సులు జారీ చేసింది. పూర్తి వివరాలతో రిజైండర్ దాఖలు చెయ్యాలని ఆదేశాలు జారీ చేసింది.

# మా నైతికతను చులకన చేయాలనే కుట్ర

### అది మీవల్ల సాధ్యం కాదని గుర్తుంచుకోండి -వైకాపా మాజీ ఎమ్మెల్యే భూమ కరుణాకర్ రెడ్డి

రాజమండ్రి, **ఆగస్టు 29 ఆంధ్ర ప్రగతి**
మా నైతికతను ప్రజల్లో పలుచన చేయాలని చూస్తున్నారు.. అది సాధ్యం కాని పని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమాన కరుణాకర్‌రెడ్డి అన్నారు.. ఏపీ మద్యం కుంభకోణంలో అరె÷-టసైన ఎంపీ మిథన్‌రెడ్డి రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉండగా.. ములాఖత్‌లో మిథున్‌రెడ్డిని భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్. డాక్టర్ గూడూరు శ్రీనివాసరావు కలిశారు.. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన భూమన.. దొంగనోట్ల, దొంగ ఓట్ల రాజ్యం ఒక రాజ్యమే కాదు అన్నారు.. వైసీపీ నేతలను, కార్యకర్తలను ఛంబల్ లోయ దొంగలుగా వెంటాడుతున్నారు.. వైసీపీ నేతలను జైల్లో కుక్కడం ఆనవాయితీగా మరింది. జగన్మోహన్ రెడ్డి దగ్గర పని చేసిన నిజాయితీ అధికారులను, ఆప్తులను కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తుంది. ఇటువంటి అరెస్టులకు మేం భయపడబోం.. మా నైతికతను ప్రజల్లో పలుచన చేయాలని చూస్తున్నారు అంటూ మండిపడ్డారు.. ప్రజలను చైతన్యవంతులు చేస్తూ మళ్లీ మిథున్‌రెడ్డి నాయకత్వంలో పోరాటాలు చేస్తూనే ఉంటాం.. జైల్లో మిథున్ రెడ్డి చాలా ధైర్యంగా ఉన్నారని తెలిపారు భూమన.. పచ్చి అబద్ధాలతో ప్రభుత్వం పన్నిన కుట్ర ఇది అని మండిపడ్డారు.. ఇక, ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి మీద నేను ఎటు-వంటి కామెంట్లు- చేయలేదన్నారు భూమన.. మరోవైపు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ.. ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా ఈ ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు.. వైసీపీ నేతలను టార్గెట్ చేసి అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు.. కాగా, ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన మిథున్‌రెడ్డి.. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉండగా.. ఈ మధ్యే మరోసారి లిక్కర్ స్కామ్ కేసు నిందితులకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించిన విషయం విదితమే..

# ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి హత్యకు కుట్ర

### రౌడీషీటర్ల ప్లాన్ వీడియో వైరల్



నెల్లూరు, **ఆగస్టు 29ఆంధ్ర ప్రగతి**:నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకి భారీ కుట్ర పన్నినట్లు- ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎమ్మెల్యే కోటంరెడ్డిని హత్య చేయాలని ఐదుగురు రౌడీ షీటర్లు మాస్టర్ ప్లాన్ వేసినట్లు- సమాచారం. ఈ హత్య మాస్టర్ ప్లాన్ వెనుక రౌడీ షీటర్ శ్రీకాంత్‌తోపాటు- అతడి ముఖ్య అనుచరుడు జగదీష్ ఉన్నట్లు- తెలుస్తోంది. రౌడీషీటర్లు జగదీష్, మహేష్, వినీత్‌తోపాటు- మరో ఇద్దరు సదరు వీడియోలో విపరీతంగా మద్యం సేవించి ఈ ఎ÷-లాన్ గురించి చర్చించినట్లు- సమాచారం. అయితే ఈ హత్య కుట్ర వెనుక వైసీపీ పెద్దల హస్తముందని టీ-డీపీ శ్రేణులు సందేహం వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాకుండా.. వైఎస్ వివేకా హత్య తరహాలోనే ఎమ్మెల్యే కోటంరెడ్డిని అంతమొందించాలని కుట్రపన్నారనే చర్చలూ జరుగుతున్నాయి. ఈ సదరు వీడియో వ్యవహారం ఐదురోజుల కిందట పోలీసులకు తెలిసందని.. కానీ వారు స్పందించలేదని టీ-డీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

# సెప్టెంబర్ 19 నుంచి ఎర్రన్న క్రీడోత్సవాలు


శ్రీకాకుళం **ఆగస్టు 29 ఆంధ్ర ప్రగతి** యువతలో సామర్థ్యాల్ని వెలికి తీయడంలో క్రీడలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తన తండ్రి, మాజీ కేంద్రమంత్రి దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు జ్ఞాపకార్థం 'ఎర్రన్న క్రీడోత్సవం' పేరిట సెప్టెంబర్ 19 నుంచి శ్రీకాకుళంలో 'ఎంపీ కప్ 2025' పోటీలు ప్రారంభించనున్నట్లు- ప్రకటించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి ప్రతిభను వెలికి తీయడంతో పాటు- ఆరోగ్యవంతమైన, బలమైన శ్రీకాకుళాన్ని నిర్మిద్దామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, ఏడు పెంకులాట, కర్రసాము, చెస్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్ వంటి ఎనిమిది ప్రధాన, సంప్రదాయ క్రీడా పోటీలను శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు- రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని సూచించారు.

----

# సరూర్‌నగర్‌లో మరో భర్త హంతకురాలు

### ప్రయుడితో కలసి భర్తను లేపేసిన భార్య


హైదరాబద్,**ఆగస్టు 29 ఆంధ్ర ప్రగతి**
ఈ మధ్యకాలంలో ప్రియుడితో కలిసి భర్తలను హతమారుస్తున్న భార్యల కేసుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా అలాంటి ఘటన మరోటి చోటుచేసుకుంది. కొందరు పెళ్లికి ముందు ప్రేమ వ్యవహారం కారణంగా భర్తలను హత్య చేస్తుంటే.. మరికొందరు పెళ్లి తర్వాత వివాహేత సంబంధం పెట్టుకొని భర్తలను కడతేరుస్తున్నారు. తాజాగా నగరంలోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇలాంటి దారుణమే చోటు- చేసుకుంది. కోదండరామ్‌నగర్‌లో ప్రియుడు హరీశ్‌తో కలిసి భార్య.. భర్తను చంపేసింది.




నాగర్‌కర్నూల్‌కు చెందిన శేఖర్, చిట్టిలకు 16 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. బతుకుదెరువు కోసం వీరిద్దరు హైదరాబాద్.. సరూర్‌నగర్‌కు వలస వచ్చి జీవిస్తున్నారు. శేఖర్ ప్రైవేటు- డ్రైవర్ కాగా.. చిట్టి ఇళ్లలో పని చేసేది. తాజాగా భర్త శేఖర్ వివాహేతర సంబంధం గురించి చిట్టిని నిలదీయడంతో అతన్ని హత్య చేయాలని కుట్ర పన్నింది. అర్ధరాత్రి ప్రియుడు హరీశ్‌ని ఇంటికి పిలిపించి నిద్రలో ఉన్న భర్తను హత్య చేసింది. ఆ తర్వాత 100కు ఫోన్ చేసి నిద్రలోనే భర్త చనిపోయాడని భార్య చెప్పింది. అయితే పోలీసులకు భార్యపై అనుమానం రావడంతో తమదైన శైలిలో ప్రశ్నించారు. దీంతో విచారణలో భార్య చిట్టి నేరం అంగీకరించింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న చిట్టి ప్రియుడు హరీశ్ గురించి పోలీసులు గాలిస్తున్నారు.

# రామసేతుపై సుబ్రమణ్యస్వామి పిటిషన్

### విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు -కేంద్రానికి నోటీసులు జారీ




న్యూఢిల్లీ, **ఆగస్టు 29 ఆంధ్ర ప్రగతి**'రామసేతు'ను జాతీయ వారసత్వ స్మారక చిహ్నంగా ప్రకటించాలని కోరుతూ గతంలో కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణ్యస్వామిదాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. దీనిపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. రామసేతుకు సకాలంలో జాతీయ స్మారక చిహ్నం హోదా కల్పించాలని, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాతో సర్వే చేయించాలని గతంలో సుబ్రమణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా విచారణ చేపట్టారు. సుబ్రమణ్య స్వామి తరపున సీనియర్ న్యాయవాది విభా మఖిజా వాదనలు వినిపించారు. రామసేతును కాలుష్యం నుంచి కాపాడటంతో పాటు- దాని పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని సుబ్రమణ్యస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ప్రదేశం పలువురి నమ్మకాలతో ముడిపడి ఉందని తెలిపారు. మరోవైపు 'సేతు సముద్రం షిప్ ఛానెల్ ప్రాజెక్టు' కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంపిక చేసుకోవాలని, తద్వారా రామసేతుకు ఇబ్బంది కలగకుండా ఉంటు-ందని పేర్కొంటూ సుబ్రమణ్య స్వామి మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ప్రస్తుతం అది సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మన్నార్, పాక్ జలసంధిని కలుపుతూ 83 కి.మీ మేర పూడిక తీసి..ఛానెల్‌ను ఏర్పాటు- చేయాల్సి ఉంటు-ంది. ఇది కార్యరూపం దాల్చితే రామసేతుపై తీవ్ర ప్రభావం ఉంటు-ందన్న ఆరోపణలు ఉన్నాయి.రామసేతును జాతీయ వారసత్వ స్మారక చిహ్నంగా ప్రకటించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణ్య స్వామి సుప్రీంకోర్టులో గతంలోనే ఓ పిల్ దాఖలు చేశారు.

# బీసీసీఐ అధ్యక్ష పదవికి రోజర్ బిన్నీ రాజీనామా




బీసీసీఐలో పెద్ద మార్పు జరిగింది. అధ్యక్షుడు రోజర్ బిన్నీ తన పదవికి రాజీనామా చేశారని వార్తలు వస్తున్నాయి. ఆయన స్థానంలో ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. కొత్త అధ్యక్షుడు ఎన్నికయ్యే వరకు శుక్లా ఈ పదవిని నిర్వహించనున్నారు. రోజర్ బిన్నీ 2022లో సౌరవ్ గంగూలీ తర్వాత బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన జూలై 19న ఆయన 70 ఏళ్ల వసంతంలోకి అడుగుపెట్టారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం 70 ఏళ్లు దాటిన ఏ ఆఫీస్ బేరర్ అయినా.. ఈ పదవిలో కొనసాగలేరు. అందుకే బిన్నీ రాజీనామా చేసినట్లుగా సమాచారం. 65 ఏళ్ల రాజీవ్ శుక్లా 2020 నుంచి బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. సెప్టెంబర్‌లో జరిగే వార్షిక సమావేశంలో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అప్పటి వరకు శుక్లా బీసీసీఐ పనులను చూస్తారు. రాష్ట్ర యూనిట్లు కలిసి కొత్త అధ్యక్షుడిని నిర్ణయిస్తాయి. ఇటీవల జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి శుక్లా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో భారత జట్టుకు కొత్త స్పాన్సర్‌ను ఎంపిక చేయడం గురించి చర్చించారు. డ్రీమ్ 11 ఇప్పటి వరకు స్పాన్సర్‌గా ఉండేది, కానీ ఇప్పుడు వారు తప్పుకున్నారు. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. కానీ కొత్త స్పాన్సర్‌ను ఇంత తక్కువ సమయంలో కనుగొనడం కష్టమని అపెక్స్ కౌన్సిల్ చెప్పింది. టెండర్లు, చట్టపరమైన ప్రక్రియలు, సాంకేతిక అంశాలు పూర్తి చేయడానికి సమయం కావాలి. ఆసియా కప్ కోసం తాత్కాలిక స్పాన్సర్‌ను ఎంచుకోవడం లేదని.. 2027లో జరిగే వన్డే ప్రపంచకప్ వరకు రెండున్నర సంవత్సరాల పాటు భారత జట్టుకు స్పాన్సర్‌గా ఉండే సంస్థ కోసం చూస్తున్నట్లు తెలిపారు.

# పీవీ సింధు అద్భుత విజయం

## • క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సింధు

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ షట్లర్, మాజీ ఛాంపియన్ పీవీ సింధు దుమ్మురేపుతోంది. గత కొన్ని నెలలుగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడిన సింధు.. ప్రతిష్టాత్మక టోర్నీలో అద్వితీయమైన ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-19, 21-15 తేడాతో ప్రపంచ రెండో ర్యాంకర్, చైనా షట్లర్ వాంగ్ జి యిపై విజయం సాధించింది. 48 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో పూర్తి ఆధిపత్యం చెలాయించిన సింధు వరుస గేమ్‌లను కైవసం చేసుకుంది. ఈ గెలుపుతో వాంగ్‌పై తన ముఖాముఖి రికార్డ్‌ను 3-2తో మెరుగుపరుచుకుంది. తొలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైనా.. సింధు తన అనుభవంతో గేమ్ పాయింట్ సాధించింది. శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు ప్రారంభమయ్యే క్వార్టర్ ఫైనల్లో ఇండోనేషియా ప్లేయర్ పుత్రి కుసుమవర్ధనితో సింధు తలపడనుంది. 38వ ర్యాంకర్ అయిన పుత్రి కుసమవర్దనితో 12వ ర్యాంకర్ పీవీ సింధు ఇప్పటి వరకు ఒకే ఒక్క మ్యాచ్ ఆడి గెలిచింది. గతేడాది జరిగిన ఉబెర్ కప్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో సింధు 21-15, 21-17 తేడాతో



పుత్రి కుసుమ వర్ధానిపై విజయం సాధించింది. ఈ రికార్డ్ ప్రకారం సింధు సునాయసంగా సెమీఫైనల్ చేరడం ఖాయంగా కనిపిస్తోంది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో సింధుకు మెరుగైన రికార్డ్ ఉంది. 2019లో స్వర్ణ పతకం సాధించిన సింధు.. 2017, 2018 టోర్నీలో రజత పతకాలు అందుకుంది. 2013, 2014లో క్యాంస్య పతకాలు సాధించింది. ఈ సారి తిరిగి స్వర్ణం సాధించాలనే పట్టుదలతో ఉంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ 19-21, 21-15,21-17 తేడాతో చైనాకు చెందిన లియాంగ్, వాంగ్ జోడీని మట్టికరిపించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ ప్రపంచ ఐదో ర్యాంక్ జంటకు షాకిచ్చింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ పిల-తనీషా క్రాస్టో జోడీ ప్రపంచ ఐదో ర్యాంక్ జంటకు షాకిచ్చింది. ప్రిక్వార్టర్స్‌లో భారత ద్వయం ధ్రువ్-పిల 19-21, 21-12, 21-15తో టాంగ్ చున్-యింగ్ సూట్(హాంకాంగ్) జంటపై గెలుపొందింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 8-21, 21-17, 21-23తో ఆండర్స్ ఆంథోన్సెన్(డెన్మార్క్) చేతిలో పరాజయం చవిచూశాడు.

# సమీర్ రిజ్వి ఊచకోత..



యూపీ ప్రీమియర్ లీగ్ 2025లో సమీర్ రిజ్వి బ్యాట్ గర్జిస్తోంది. ఈ లీగ్‌లో కాన్పూర్ సూపర్‌స్టార్స్ జట్టుకు నాయకత్వం వహిస్తున్న సమీర్ మరోసారి సిక్స్‌లు, ఫోర్లు బాదాడు. ఈరోజు లక్నో ఫాల్కన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సమీర్ రిజ్వి కేవలం 32 బంతుల్లో అజేయంగా 76 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల విజయాన్ని అందించాడు. 163 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన కాన్పూర్ జట్టు సమీర్ మెరుపు బ్యాటింగ్ కారణంగా కేవలం 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. బ్యాటింగ్‌కు దిగిన సమీర్ రిజ్వి ఆటను చాలా స్లోగా ప్రారంభించాడు. ఆ విధంగా మొదటి 15 బంతుల్లో కేవలం 12 పరుగులు మాత్రమే చేశాడు. కానీ, ఆ తర్వాత లక్నో బౌలర్లపై దాడి చేయడం ప్రారంభించిన సమీర్ రిజ్వి తరువాతి 17 బంతుల్లో 9 సిక్సర్లు బాదాడు. గొప్ప విషయం ఏమిటంటే చివరి 11 బంతుల్లో 7 సిక్సర్లు, 2 ఫోర్లు బాదాడు. సమీర్ రిజ్వి చివరి వరకు నాటౌట్‌గా నిలిచాడు. తన జట్టుకు విజయం అందించిన తర్వాతే తిరిగి వచ్చాడు.

# గతం గురించి నేను ఎప్పుడూ చింతించను

### నేను ఎవరినీ నిందించాలనుకోవడం లేదు

### భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ

భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి తరచుగా వార్తల్లో నిలుస్తున్నాడు. షమీ 2014లో హసిన్ జహాన్‌ను వివాహం చేసుకుని, నాలుగు సంవత్సరాలుగా విడివిడిగా జీవిస్తున్నారు. షమీతోపాటు అతని కుటుంబం శారీరకంగా, మానసికంగా హింసించారని హసిన్ జహాన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. హసిన్ జహాన్ గృహ హింస, మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు కూడా చేసింది. షమీకి చాలా మంది మహిళలతో అక్రమ సంబంధాలు ఉన్నాయని కూడా ఆమె ఆరోపించింది. మహ్మద్ షమీ కూడా ఈ ఆరోపణలన్నింటినీ ఖండించారు. ఇటీవల షమీ హసిన్ జహాన్‌ను వివాహం చేసుకున్నందుకు చింతిస్తున్నట్లు సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. హసిన్ జహాన్ సోషల్ మీడియా పోస్టుల ద్వారా నిరంతరం మహమ్మద్ షమీని లక్ష్యంగా చేసుకుంటూ వస్తోంది. ఆమె సోషల్ మీడియా, న్యూస్ ఛానెళ్లలో షమీకి వ్యతిరేకంగా మాట్లాడుతోంది. ఈ నెల ప్రారంభంలో, జహాన్ షమీని 'ఉమెనైజర్' అని కూడా పిలిచింది. అతను తన స్నేహితురాళ్ల పిల్లలకు ప్రాధాన్యత ఇస్తాడని, వారికి ఖరీదైన బహుమతులు ఇస్తాడని, తన కుమార్తె ఐరాను పూర్తిగా విస్మరిస్తాడని ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో షమీ తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ, గతంలో జీవించడం తనకు ఇష్టం లేదని అన్నారు. తన వివాహం



గురించి తనకున్న విచారం గురించి అడిగినపుడు, షమీ, "అలా వదిలేయండి. గతం గురించి నేను ఎప్పుడూ చింతించను. పోయినది పోయింది. నేను ఎవరినీ నిందించాలనుకోవడం లేదు, నన్ను కూడా నిందించాలనుకుంటున్నాను. నా క్రికెట్ పై దృష్టి పెట్టాలనుకుంటున్నాను. నాకు ఈ వివాదాలు అవసరం లేదు" అని అన్నారు. షమీ ఒక్కడే కాదు, వైవాహిక జీవితం సమస్యలతో నిండిన మరికొందరు క్రికెటర్లు కూడా ఉన్నారు. భారత మాజీ బ్యాట్స్‌మన్ శిఖర్ ధావన్ కూడా తన భార్య ఆయేషా ముఖర్జీ నుంచి విడాకులు తీసుకున్నాడు. ఈ సంవత్సరం, భారత స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ కూడా విడాకులు తీసుకున్నారు. ధావన్, చాహల్, హార్దిక్ పాండ్యా కూడా వారి భాగస్వాములతో వివాదాల్లో చిక్కుకున్నారు. ఈ క్రమంలో షమీ మాట్లాడుతూ 'దర్యాప్తు చేయడం మీ పని. మమ్మల్ని ఎందుకు ఉరితీయాలనుకుంటున్నారు మరొక వైపు కూడా చూడండి. నేను క్రికెట్‌పై దృష్టి పెడతాను, వివాదాలపై కాదు' అంటూ సమాధానం ఇచ్చాడు. షమీ ఇటీవలే దులీప్ ట్రోఫీలో తూర్పు జోన్ తరపున ఆడుతూ పోటీ క్రికెట్‌లోకి తిరిగి వచ్చాడు. 34 ఏళ్ల అతను బెంగళూరులో నార్త్ జోన్‌తో జరిగిన మొదటి రోజున 17 ఓవర్లలో 55 పరుగులకు 1 వికెట్ తీసుకున్నాడు. షమీ చివరిసారిగా మే 2న ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2025 ఐపీఎల్ సీజన్ షమీకి మంచిది కాదు. అతను 9 మ్యాచ్‌ల్లో కేవలం 6 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. సెప్టెంబర్‌లో జరగనున్న ఆసియా కప్‌నకు కూడా అతను జట్టులో ఎంపిక కాలేదు. మార్చిలో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత అతను జాతీయ జట్టు తరపున ఆడలేదు.

# స్వస్తిక్ చికారా అద్భుతమైన ప్రదర్శన



ఉత్తర ప్రదేశ్ ప్రీమియర్ లీగ్ 2025 20వ మ్యాచ్ భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగింది. ఇందులో లక్నో ఫాల్కన్స్ మీరట్ మావెరిక్స్‌తో తలపడింది. ఈ మ్యాచ్‌లో, రింకు సింగ్ కెప్టెన్సీలో మీరట్ మావెరిక్స్ భారీ విజయాన్ని సాధించింది. మరోవైపు, లక్నో ఫాల్కన్స్ జట్టు పూర్తిగా విఫలమైంది. ఆ జట్టు బౌలర్లు ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయారు. రింకు సింగ్ జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. అది సరైనదని నిరూపితమైంది. స్వస్తిక్ చికారా జట్టుకు అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అతను 31 బంతులు ఎదుర్కొని 55 పరుగులు చేశాడు. ఇందులో 4 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. ఆ తర్వాత, రుతురాజ్, రింకు సింగ్ మైదానంలో ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించారు. రింకు సింగ్ 27 బంతుల్లో 211.11 స్ట్రైక్ రేట్‌తో 57 పరుగులు చేశాడు. అతను తన ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. మరోవైపు, రుతురాజ్ శర్మ 37 బంతుల్లో 74 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడాడు. రుతురాజ్ శర్మ తన ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు బాదాడు. ఆ తర్వాత, హృతిక్ వాట్స్ చివరి ఓవర్‌లో తుఫాను ఇన్నింగ్స్ ఆడి జట్టును భారీ స్కోరుకు తీసుకెళ్లాడు. హృతిక్ వాట్స్ 437.50 స్ట్రైక్ రేట్‌తో కేవలం 8 బంతుల్లో 35 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అతను 2 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. దీని కారణంగా రింకు జట్టు 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేయగలిగింది. ఈ ఇన్నింగ్స్‌లో, మీరట్ మావెరిక్స్ జట్టు మొత్తం 17 సిక్సర్లు బాదింది. 234 పరుగులకు ప్రతిస్పందనగా, లక్నో ఫాల్కన్స్ 18.2 ఓవర్లలో 140 పరుగులు చేసి ఆలౌట్ అయింది. లక్నో ఫాల్కన్స్ తరపున సమీర్ చౌదరి అత్యధికంగా 46 పరుగులు చేశాడు. అతను తప్ప, ఏ బ్యాటర్ కూడా 30 పరుగుల మార్కును చేరుకోలేకపోయాడు. మరోవైపు, మీరట్ మావెరిక్స్ తరపున ఈ ఇన్నింగ్స్‌లో యష్ గార్గ్, జీషన్ అన్సారీ గరిష్టంగా 3-3 వికెట్లు తీశారు. అదే సమయంలో, విజయ్ కుమార్, కార్తీక్ త్యాగి తలా 2-2 బ్యాట్స్‌మెన్‌లను తీసుకున్నారు. దీని కారణంగా ఆ జట్టు 93 పరుగుల తేడాతో విజయం సాధించగలిగింది.

# బౌలర్లు ఎవరైనా నాకు ఒక్కటే...

### టీమ్‌ఇండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ

టీమ్‌ఇండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ సిక్స్‌లు బాదడంలో చాలా స్పెషల్. బుల్లెట్లలా దూసుకొస్తున్న బంతులను సైతం రోహిత్ స్టాండ్స్‌కు మళ్లించగలడు. ఇక బౌన్సర్‌ను అతడు కొట్టే పుల్ షాట్‌కు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అందుకే అతడికి హిట్‌మ్యాన్ అనే పేరుంది. అలా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన లిస్ట్‌లో రోహిత్ టాప్‌లో ఉన్నాడు. తాజాగా రోహిత్ ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఇందులో అతడికి ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. ఎవరి బౌలింగ్‌లో సిక్స్‌లు కొట్టేందుకు ఆసక్తి చూపిస్తారు అని యాంకర్, రోహిత్ శర్మను ప్రశ్నించారు. దీనికి హిట్‌మ్యాన్ ఏ బౌలర్ పేరును చెప్తాడు ఎలా స్పందిస్తాడో అని ఆసక్తిగా చూశారు. కానీ, రోహిత్ ఆన్సర్ అత్యంత ఆసక్తిగా ఉండడం విశేషం. మరి అతడు ఏమన్నాడంటే "నిజంగా చెబుతున్నా, నేను ప్రతీ బౌలర్ బౌలింగ్‌లో హిట్టింగ్ ఆడడానికి ఇష్టపడతాను. ప్రత్యేకంగా ఫలానా బౌలర్ అని ఏమీ లేదు. క్రీజ్‌లో నా మైండ్‌సెట్ ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. హిట్టింగ్ ఆడేందుకే ఇష్టపడతాను. నా ముందు ఎవరు ఉన్నారు ఎవరు బౌలింగ్ చేస్తున్నారు అనేది నేను అస్సలు పట్టించుకోను. ప్రతి మ్యాచ్‌లో ప్రతి బౌలర్‌పైనా ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నిస్తాను" అని రోహిత్ రిప్లై ఇచ్చాడు. దీంతో ఆడిటోరియం అంత చప్పట్లతో మార్మోగిపోయింది. అలాగే మరో ఆసక్తికర ప్రశ్నకు కూడా రోహిత్ సమాధానమిచ్చాడు. 'టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో మీరు సరదాగా, జోకులు వేసుకుని, నవ్వుకోవడానికి ఎవరి రూమ్‌కు వెళ్తారు' అని అడిగారు. దీనికి రోహిత్ "ఈ విషయంలో ఒకే వ్యక్తి కాదు. నేను అందరితో కలిసిపోతాను. కానీ నవ్వుకునేందుకు మాత్రం శిఖర్ ధావన్ చాలా ఫన్నీగా ఉంటాడు" అని చెప్పాడు. దీంతో రోహిత్- ధావన్ బాండింగ్ బాగుందని హిట్‌మ్యాన్ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అయితే 2013 నుంచి వన్డే ఫార్మాట్‌లో కొన్నేళ్లపాటు రోహిత్-ధావన్ ఓపెనింగ్ చేశారు. ఈ జోడీ జట్టుకు అనేక శుభారంభాలు ఇచ్చింది. రోహిత్ ఇప్పటివరకు ఇంటర్నేషనల్ కెరీర్‌లో 499 మ్యాచుల్లో 637 సిక్స్‌లు బాదాడు. టెస్టుల్లో 88, వన్డేల్లో 344, టీ20ల్లో 205 సిక్స్‌లు ఉన్నాయి. ఇక ఐపీఎల్‌లో 302 సిక్స్‌లు ఉన్నాయి. ఇవి కాకుండా దేశవాళీలో గణాంకాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. ఇక అంతర్జాతీయంగా అత్యధిక సిక్స్‌లు బాదిన ప్లేయర్‌గా రోహిత్ టాప్‌లో ఉండగా, విండీస్ దిగ్గజం క్రిస్ గేల్ (553) రెండో స్థానంలో ఉన్నాడు. రోహిత్ శర్మ ప్రస్తుతం వన్డేల్లోనే ఆడుతున్నాడు. అయితే టీమ్‌ఇండియా తరఫున చివరిసారిగా మార్చిలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఆడాడు. అప్పట్నుంచి ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అతడు బరిలోకి దిగలేదు. ఇక అక్టోబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు రోహిత్ సిద్ధం అవుతున్నాడు. ఈ టూర్‌లో భారత్ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనుంది. ఇందులో హిట్‌మ్యాన్ బరిలో దిగే ఛాన్స్ ఉంది. అందుకే రోహిత్ ప్రస్తుతం ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాడు. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 13న బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌కు వెళ్లనున్నాడు. అక్కడ ఫిట్‌నెస్ టెస్టులో పాల్గొననున్నట్లు జాతీయ మీడియా కథనాల్లో వెల్లడించింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక




# అభిమాని పట్ల చిరు ఆప్యాయత

## ఆదోని నుంచి సైకిల్‌పై వచ్చిన మహిళకు ఆదరణ

మహోన్నత వ్యక్తిత్వం, అపారమైన సేవాతత్వంతో కోట్లాది మందికి ఆదర్శంగా నిలుస్తున్న మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ఆదోని పట్టణానికి చెందిన వీరాభిమాని రాజేశ్వరి, చిరంజీవిని ఒక్కసారి ప్రత్యక్షంగా కలవాలన్న ఆశతో సైకిల్‌పై హైదరాబాద్‌కి సాహసోపేతమైన యాత్ర ప్రారంభించారు. శారీరకంగా, మానసికంగా ఎన్నో కష్టాలు ఎదురైనా, చిరు మీద ఉన్న అపారమైన అభిమానమే ఆమెకు బలంగా నిలిచింది. ఈ విషయం తెలుసుకున్న చిరంజీవి, ఆమెను స్వయంగా ఆహ్వానించి, తన అభిమానానికి అద్భుతమైన గుర్తుగా చీరని బహుకరించారు. అలానే తన పిల్లల చదువుకి సంబంధించిన బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. అయితే రాజేశ్వరి, తన పిల్లలతో కలిసి మెగాస్టార్‌ను కలిసిన సమయంలో చిరంజీవికి రాఖీ కట్టి, ఆయనను తన అన్నయ్యలా భావిస్తున్నట్టు- తెలిపారు. ఈ అనుబంధానికి స్పందించిన చిరు, ఆమెకు సాంప్రదాయబద్ధంగా చీరను బహుమతిగా ఇవ్వడం, ఆశీర్వాదాలు అందించడం జరిగింది. తన అభిమానిని భావోద్వేగంతో గుర్తించిన చిరంజీవి, రాజేశ్వరి పిల్లల విద్యా భారం తానే భరిస్తానని హామీ ఇచ్చారు. వారి భవిష్యత్తు వెలుగుల బాటలో సాగేలా చేయడమే తన బాధ్యతగా భావించారు. అభిమానులను కేవలం అభిమానులుగానే కాకుండా,



తన కుటుంబ సభ్యుల్లా చూసుకునే చిరంజీవి గొప్ప మనసుకు ఇది మరో బలమైన ఉదాహరణగా నిలిచింది. ఈ సంఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెటిజన్లు చిరంజీవి పెద్ద మనసును ప్రశంసిస్తూ, తెరపై నటన ఒక్కటే కాదు - నిజ జీవితంలోనూ ఆయన ఓ మహామనిషి అని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం చిరంజీవి విశ్వంభర సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో పాటు-, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'మన శంకర వరప్రసాద్' చిత్రంతో కూడా ప్రేక్షకులను ఆకట్టు-కునేందుకు సిద్ధంగా ఉన్నారు. రెండు సినిమాలూ జెట్ స్పీడ్‌తో షూటింగ్ దశలో ఉన్నట్టు- సమాచారం.



# అఖండ-2 విడుదల మరింత ఆలస్యం

విజయవంతమైన 'అఖండ' చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న 'అఖండ 2: తాండవం' విడుదల వాయిదా పడింది. నిర్మాణానంతర పనుల కోసం అదనపు సమయం కేటాయించాల్సి రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా నిర్మాణ సంస్థలు ఓ ప్రకటనలో తెలిపాయి. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. సంయుక్తా మేనన్ కథానాయిక. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న సినిమాని విడుదల చేయాలని ఇదివరకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, సినిమా స్థాయిని దృష్టిలో ఉంచుకుని మరింత నాణ్యమైన రీరికార్డింగ్, విజువల్ ఎఫెక్ట్స్ హంగుల్ని జోడించడం కోసం సినిమా విడుదలని వాయిదా వేస్తున్నట్టు- నిర్మాణ వర్గాలు తెలిపాయి. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నాయి. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతిని పంచడం కోసం విజువల్స్ పరంగా, స్కేల్ పరంగా రాజీపడకుండా మా బృందం పనిచేస్తోంది. 'అఖండ'కి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందుకు దీటు-గా చిత్రాన్ని మలచడంపై దృష్టి పెట్టామని నిర్మాణ వర్గాలు తెలిపాయి. యువ కథానాయకుడు ఆది పినిశెట్టి ఇందులో కీలక పాత్రని పోషిస్తున్నారు. సంగీతం తమన్ అందిస్తున్నారు.



# నివేద థామస్ కొత్త లుక్

కొందరు ఎంతగా నియంత్రించాలనుకున్నా అధిక బరువు సమస్య నుంచి బయటపడలేరు. అదే జాబితాలో ఉంది నివేద థామస్. ఈ బ్యూటీ తనదైన అందం, ప్రతిభతో పాటు మంచి మాట తీరుతోను అందరి హృదయాలను కొల్లగొడుతుంది. నివేద థామస్ ఒక మలయాళీ అమ్మాయి అయినా కానీ, తెలుగులో అద్భుతంగా మాట్లాడి మనసుల్ని గెలుచుకుంటుంది. అందుకే ఈ బ్యూటీ రేసులో వెనకబడటాన్ని అభిమానులు సహించలేకపోతున్నారు. అయితే నివేద ఇటీవల అవకాశాలు అందుకోలేకపోవడానికి కారణంఅధిక బరువు సమస్య అని చెబుతున్నారు.


ఇటీవల కొంతకాలంగా నివేద అదుపు తప్పి బరువు పెరగడం తీవ్ర ఆందోళనలకు కారణమైంది. ఇదే తీరుగా బరువు పెరుగుతూ ఉంటే, మునుముందు మమ్మీ, ఆంటీ పాత్రలకు కూడా ఎంపికవ్వడం కష్టమని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. నివేద తిరిగి నిన్ను కోరి, బ్రోచేవారెవరురా లో కనిపించినట్టుగా హీరోయిన్ మెటీరియల్ లుక్‌తో కనిపించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. కానీ నివేద మాత్రం దీనికోసం జిమ్ లో కసరత్తులు చేయకపోవడం, అదనంగా శ్రమించకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. అయితే నివేద ఉన్నట్టుండి ఇటీవల కొత్త ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఈసారి కొంత బరువు తగ్గి అందంగా కనిపించింది. లేటెస్ట్ ఫోటోషూట్ చూడగానే అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. నివేద ఈజ్ బ్యాక్! అంటూ ఫ్యాన్స్ తమ ఫేవరెట్ నటికి వెల్ కం చెబుతున్నారు. 2025 గదర్ అవార్డుల్లో కనిపించిన రూపానికి ఇప్పటికి చాలా మెరుగ్గా కనిపిస్తోంది. ఇప్పుడు బరువు తగ్గింది. ఇంకా మునుముందు బరువు తగ్గేందుకు ఆస్కారం ఉందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. నివేద ఇదే తీరుగా కసరత్తులతో మరింత స్లిమ్ గా మారాలని కోరుకుంటున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే ... ఇటీవల %-%35- చిన్న కథ కాదు%-% అనే చిత్రంలో ఒక స్కూల్ పిల్లాడికి తల్లిగా నటించిన నివేద థామస్ తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ఈ సినిమాలో నటనకు గాను గద్దర్ అవార్డ్స్ లో ఉత్తమ నటి పురస్కారాన్ని గెలుచుకుంది. ప్రస్తుతం బరువు తగ్గుతోంది. మునుముందు ఇంకా స్లిమ్ గా మారి టాలీవుడ్ లో మరిన్ని చిత్రాల్లో నటించేందుకు అవకాశం ఉందని భావిస్తున్నారు.

# విశాల్, ధన్సిక నిశ్చితార్థం..

కోలీవుడ్ యాక్షన్ హీరో, విలక్షణ నటుడు విశాల్ తన పుట్టినరోజున అభిమానులకు తీపి కబురు అందించారు. తన ప్రేయసి, ప్రముఖ నటి సాయి ధన్సికతో ఆయన నిశ్చితార్థం శుక్రవారం ఘనంగా జరిగింది. చెన్నైలోని విశాల్ నివాసంలో జరిగిన ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం ఈ జంట ఉంగరాలు మార్చుకుంటున్న ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. గత మే నెలలోనే తాము ప్రేమలో ఉన్న విషయాన్ని విశాల్, ధన్సిక అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి, విశాల్ పుట్టినరోజైన ఈరోజే వీరి వివాహం జరగాల్సి ఉంది. అయితే, విశాల్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న నడిగర్ సంఘం (తమిళ నటీనటుల సంఘం) భవన నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో పెళ్లిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని విశాల్ గతంలో ప్రకటించారు. ఇక నటి సాయి ధన్సిక విషయానికొస్తే, జూనియర్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి తన ప్రతిభతో ఎదిగారు. సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'కబాలి' చిత్రంలో ఆయన కూతురి పాత్రలో అద్భుతంగా నటించి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా తర్వాత ఆమెకు తమిళంతో పాటు తెలుగులోనూ వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఇద్దరూ తమ కెరీర్‌లో బిజీగా ఉండగా, త్వరలోనే వీరి పెళ్లి తేదీని ప్రకటించే అవకాశం ఉంది.



# శివాజీ మూవీలో అందుకే విలన్‌గా నటించలేదు: సత్యరాజ్



తలైవర్ సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా వచ్చి బ్లాక్ బస్టర్ అందుకున్న చిత్రం శివాజీ. కమర్శియల్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమాలో విలన్‌గా సుమన్ నటించాడు. అయితే ఈ సినిమాలో విలన్ పాత్రకి మొదటగా సత్యరాజ్‌ని అనుకున్న విషయం తెలిసిందే. కానీ అనుకోని కారణాల వలన ఈ ప్రాజెక్ట్ నుంచి సత్యరాజ్ తప్పుకున్నాడు. దీంతో మీడియాలో రజనీకి, సత్యరాజ్‌కి గొడవ అయ్యిందని అందుకే ఈ సినిమా చేయడానికి సత్య రాజ్ ఒప్పుకోలేదని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే దాదాపు 18 ఏండ్ల తర్వాత ఈ వివాదంపై తాజాగా స్పందించాడు నటుడు సత్యరాజ్. తాను శివాజీ సినిమా ఎందుకు చేయలేదు అనే కారణాన్ని వెల్లడించాడు. శివాజీ సినిమా నేను ఒప్పుకోకపోవడానికి బలమైన కారణముంది. నా కెరీర్ అప్పుడప్పుడే మొదలైంది. అప్పుడే హీరోగా నటించడం గుర్తింపు రావడం జరుగుతుంది. ఆ సమయంలో శంకర్ నా దగ్గరికి వచ్చి విలన్ రోల్ ఆఫర్ చేశాడు. నేను అప్పుడు విలన్‌గా అంగీకరించి ఉంటే తర్వాత నాకు అన్ని విలన్ పాత్రలే దొరికేవి. అందుకే శంకర్ ఇచ్చిన ఆఫర్‌ని రిజెక్ట్ చేశాను. అయితే నేను రిజెక్ట్ చేసిన అనంతరం మీడియాలో చాలా రూమర్లు వచ్చాయి. కానీ అవేవి నిజం కాదు. అంటూ సత్యరాజ్ చెప్పుకోచ్చాడు. దాదాపు 38 ఏళ్ల తర్వాత రజనీ, సత్యరాజ్ కలిసి 'కూలీ' సినిమాలో నటించారు. ఈ సినిమాకు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించగా.. ఇటీవలే విడుదలై మంచి విజయాన్ని అందుకుంది.



# నాగ్ బర్త్‌డే స్పెషల్ మ్యాష్ అప్ విడుదల

టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోలున్నప్పటికీ గ్రీకువీరుడు, మన్మధుడు, కింగ్ అనగానే గుర్తొచ్చేది మాత్రం నాగార్జుననే. నటనలో శివ నుంచి మొదలు ఇక తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. 66 ఏళ్ల వయసులోనూ భిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ వరుస సినిమాలతో అలరిస్తున్నాడీ హీరో. శుక్రవారం అక్కినేని హీరో పుట్టినరోజు సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ఓ స్పెషల్ మ్యాష్‌అప్ వీడియోను విడుదల చేసింది. ఇప్పటి వరకూ ఆయన చేసిన సినిమాల్లోని కొన్ని పాత్రల ఫేమస్ డైలాగులతో చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'ఈ ఫీల్డ్‌లో కొత్తగా ట్రై చేయాలంటే నేనే' అంటూ నాగార్జున డైలాగ్ ఆకట్టుకుంటోంది. నాగ్ బర్త్ డే సందర్భంగా అయనకు సినీ రాజకీయ ప్రముఖులు,అభిమానులు విషెస్ తెలిపారు.